ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
ఆదివారం 9, మార్చి 2025





ద్వాక్రా మహిళలకు రుణాల చెక్కును అందజేస్తున్న చంద్రబాబు, మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



మహిళా సదస్సులో సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న మహిళలు

బాబు భరోసా

- వెలిగొండను పూర్తిచేస్తాం.. గోదావరి జలాలూ ఇస్తాం
- మార్కాపురంను జిల్లా చేస్తున్నా
- ఉపన్యాసం కన్నా మహిళలకు శిక్షణకే ప్రాధాన్యమిచ్చిన చంద్రబాబు
- నవ్వుతూ నవ్విస్తూ మాట్లాడిన సీఎం
- కేడర్‌లో భరోసా కల్పించేలా ప్రసంగం
- పనితీరు మెరుగుపడాలంటూ ఎమ్మెల్యే కందులకు చురకలు

మార్కాపురంలో ఐదున్నర గంటలపాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించిన కార్యక్రమం ఆద్యంతం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. మహిళా సదస్సులో తాను నవ్వుతూ.. మహిళలను నవ్విస్తూ ఉత్తేజంగా మాట్లాడటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇటు మహిళా సదస్సులోనూ, అటు పార్టీ కార్యకర్తల సమావేశంలోనూ వెలిగొండను తానే పూర్తిచేస్తానని పునరుద్ఘాటించారు. ఆ ప్రాజెక్టు నిర్మాణ వ్యవహారానికి సంబంధించిన అనేక అంశాలను ప్రస్తావించారు. మార్కాపురం జిల్లాను చేస్తున్నానని నిర్దిష్టంగా ప్రకటించారు. కార్యకర్తలకు భరోసా కల్పిస్తూ వారికి కొన్ని సూచనలు చేశారు. ఎమ్మెల్యే పనితీరును కూడా ప్రధానంగా ప్రస్తావించారు. మొత్తంగా నారాయణరెడ్డి పనితీరు మెరుగుపడాలని చురకవేశారు. అవసరమైనప్పుడు అందరి చిట్టా విప్పుతానని హెచ్చరించారు.

వెలిగొండకు గోదావరి జలాలు కూడా..

మహిళా సదస్సులో ఒక మహిళా రైతు సాగునీటి సమస్యను ప్రస్తావిస్తూ వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేయాలని సీఎంను కోరారు. వెంటనే చంద్రబాబు.. పూర్తికాలేదా! నీళ్లు రావడం లేదా!? మరి మొన్న ఆయన (జగన్) ప్రాజెక్టును జాతికి అంకితం చేశానని ప్రకటించారు కదా! అంటూ వెలిగొండ ప్రాజెక్టు విషయంలో వైసీపీ ప్రభుత్వం ఆడిన డ్రామాను మహిళలతోనే చెప్పించే ప్రయత్నం చేశారు. అనంతరం ఆయన వెలిగొండను తాను పూర్తిచేయటమే గాక నీటి సమస్య ఎదురుకాకుండా గోదావరి జలాలను కూడా ఈ ప్రాజెక్టుకు మళ్లిస్తానని వివరించారు. పోలవరం నుంచి బనకచర్ల రిజర్వాయరుకు నీటి మళ్లింపు కార్యక్రమం చేపడుతున్నందున అక్కడి నుంచి గోదావరి నీటిని కూడా తరలించి వెలిగొండ ప్రాజెక్టు ద్వారా మీ జిల్లాకు అందిస్తామన్నారు. అందుకు అవసరమైన భూసేకరణ పూర్తిచేస్తానని, పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారం చెల్లించడంతో పాటు పనులన్నీ పూర్తిచేసి సంతృప్తిగా జలాలను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత కార్యకర్తల సమావేశంలోనూ ఈ విషయంపై మరోసారి స్పష్టతనిచ్చారు.

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ప్రజా సమస్యలు, పశ్చిమప్రాంత అభివృద్ధిపై నిర్దిష్టమైన హామీలు ఇవ్వడంతోపాటు కేడర్‌కు భరోసా కల్పిస్తూ.. మహిళలకు ఊకదంపుడు ఉపన్యాసం ఇవ్వకుండా పారిశ్రామిక ఎదుగుదల దిశగా వారిలో ఉత్తేజం నింపుతూ కార్యక్రమం నిర్వహించడంలో సీఎం చంద్రబాబు సఫలీకృతులయ్యారు. శనివారం మార్కాపురం వచ్చిన ఆయన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొనటమే గాక టీడీపీ కేడర్‌తో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. డ్వాక్రా, మెప్మా మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించే అంశాలపై అనేక సంస్థలతో ప్రభుత్వపరంగా ఒప్పందాలు చేసుకున్నారు.

సదస్సులో నవ్వుతూ.. నవ్విస్తూ

తొలుత రెండు గంటలపాటు మహిళా సదస్సులో పాల్గొన్న చంద్రబాబు ఊకదంపుడు ఉపన్యాసాలకు పోకుండా వారికి భరోసా కల్పించే విధంగా సదస్సును నిర్వహించారు. ఒకవైపు యాంకర్, మరోవైపు మహిళలు అడిగిన ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలిచ్చారు. మధ్యమధ్యలో చలోక్తులతో మహిళలను నవ్వించారు. డ్వాక్రా, మెప్మా మహిళలకు మరింత రుణసౌకర్యం కల్పించి వారు తయారుచేసే వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించే సంస్థలతో ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా వాటి ప్రతినిధుల ద్వారా ఆయా అంశాలపై మహిళలకు సమాచారాన్ని ఇప్పించారు. తొలుత రమారమి గంటసేపు స్టాల్స్‌ను సందర్శించి ఆయా కంపెనీలతో ఒప్పందాలు చేసుకునే కార్యక్రమాలు నిర్వహించిన ఆయన ఆ వెంటనే రెండుగంటల పాటు సదస్సులో పాల్గొన్నారు. మహిళలు కొన్ని ప్రశ్నలు సూటిగా వేసినా.. జీతాలు పెంచాలంటూ వెలుగు ఉద్యోగినులు, ఆరోగ్యశాఖ ఉద్యోగులు అర్జీలు ఇచ్చినా వినమ్రతతో సమాధానం చెప్పడం విశేషం.

మార్కాపురం కేంద్రంగా జిల్లా చేస్తా

మహిళా సదస్సులో ఒక విద్యార్థిని మాట్లాడుతూ మార్కాపురం జిల్లా విషయాన్ని ప్రస్తావించారు. అనంతరం పార్టీ కార్యకర్తల సమావేశంలో కేడర్ అడగకుండానే సీఎం చంద్రబాబు జిల్లా విషయాన్ని ప్రస్తావించారు. 'మార్కాపురం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేస్తా. అందులో ఎలాంటి భేషజాలు లేవు. ఎన్నికల సమయంలోనే నేను హామీ ఇచ్చా. తప్పకుండా చేస్తా. తద్వారా అన్నిరంగాలలో ఈ కొత్త జిల్లాకు రావాల్సిన సౌకర్యాలన్నీ కల్పిస్తా' అని స్పష్టంగా వెల్లడించారు.



శక్తి యాప్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన మంత్రి సంధ్యారాణి, బీజీ రాజకుమారి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి, టీడీపీ దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి



ఫ్లిప్‌కార్ట్‌తో ఎంవోయూ పత్రాలను చూపుతున్న సీఎం చంద్రబాబు, పక్కన ఆ సంస్థ ప్రతినిధులు



మహిళలకు కుట్టుమిషన్‌లను పంపిణీ చేస్తున్న చంద్రబాబు



వాయిద్య కళాకారులతో ఆప్యాయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు

పదవుల విషయంలో కేడర్‌కు స్పష్టత

పార్టీ కార్యకర్తల సమావేశంలో గంటసేపు పాల్గొన్న చంద్రబాబు.. కేడర్‌కు పూర్తిస్థాయిలో భరోసా కల్పించారు. పార్టీ నిర్మాణ వ్యవహారాల్లో చేస్తున్న మార్పులను వివరిస్తూ టీడీపీ కోసం పనిచేసిన వారికే నామినేటెడ్ పోస్టులు అన్న సంకేతాలు ఇచ్చేశారు. ఎమ్మెల్యేలు చెప్పారని కార్యకర్తలను పక్కనపెట్టే ప్రశ్నే లేదని సూటిగా స్పష్టం చేశారు. రానున్న మూడు నెలల్లో వాట్సాప్ యాప్ ద్వారా కేడర్‌తో అప్పటికప్పుడు ముచ్చటిస్తానని చెప్పడంతో కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ, నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో కార్యకర్తలకు అన్యాయం జరగదన్న స్పష్టత ఇవ్వగలిగారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు పదవులు పొందినవారు ఎవరైనా పనిలో విఫలమైతే తగినమూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కందుల పనితీరు మెరుగుపడాలి

కార్యకర్తల సమావేశంలో మార్కాపురం ఎమ్మెల్యే కందులనారాయణరెడ్డి పనితీరు మెరుగుపడాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కొన్ని అంశాలలో బాగోలేదు, కొన్ని అంశాలలో బాగుంది అంటూ తదనుగుణ వివరాలను కార్యకర్తలకు వెల్లడించారు. ఒక్క నారాయణరెడ్డి గురించే కాదు.. అందరు ఎమ్మెల్యేల గురించి చెబుతున్నానంటూ కొన్ని అంశాలను ఆయన ప్రస్తావించారు. చివర్లో మార్కాపురం విషయానికొస్తే అంటూ 'గత ఎన్నికల్లో 7.2శాతం మెజారిటీతో గెలిచాం. కానీ ఇక్కడ శాశ్వతంగా గెలవాలంటే మెజారిటీ 15శాతానికి పెరగాలి. అందుకు తగ్గట్లు అటు ఎమ్మెల్యే, ఇటు కార్యకర్తలు కలిసి పనిచేయాలి. కానీ తన వద్ద ఉన్న సమాచారాన్ని బట్టి చూస్తే పనితీరు అందుకు తగ్గట్లు లేదు' అని వ్యాఖ్యానించారు. పార్టీ సభ్యత్వంలో నియోజకవర్గం 104వ స్థానంలో ఉందన్నారు. ప్రభుత్వం వివిధ రకాలుగా పేదలకు సేవాకార్యక్రమాలు చేస్తుంటే మూడింటిలో మాత్రమే ఎమ్మెల్యే పాల్గొన్నారని తెలిపారు. దీంతో కందుల జోక్యం చేసుకుని కాలి ఆపరేషన్ కారణంగా ఇబ్బంది వచ్చిందని చెప్పగా, వెరీ హ్యాపీ.. ఆపరేషన్ సక్సెస్ అయింది, ఇక వేగంగా పనిచేయండన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నో ర్యాంకులో ఉన్నారో చెప్పనని, పనితీరు మాత్రం మెరుగుపర్చుకోవాలని సూచించారు.

ఎంవోయూలు.. పథకాలు.. రుణాలు



- మార్కాపురంలో సీఎం చంద్రబాబు బిజీబిజీ
- మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా మరింత మెరుగ్గా సేవలు అందించాలని సూచన
- స్టాల్స్ సందర్శన, నిర్వాహకుల ద్వారా సమాచార సేకరణ

7

మహిళా డ్రైవర్లకు ఈ-ఆటోల కొనుగోలుకు బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును అందజేస్తున్న చంద్రబాబు

సతీమణి కోసం రూ.25వేల చీర కొనుగోలు చేసిన సీఎం

స్టాల్స్ సందర్శన సందర్భంగా రూ.25వేల ఖరీదైన చీరను తన సతీమణి కోసం చంద్రబాబు కొనుగోలు చేశారు. స్టాల్స్‌ను సందర్శించే క్రమంలో మొబైల్ చేనేత వస్త్రాల విక్రయాలను ఆయన పరిశీలించారు. ఆ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని చేనేత సొసైటీల నుంచి 36 రకాల వస్త్రాలను తెచ్చి మొబైల్ వాహనంతో అన్ని ప్రాంతాల్లో వ్యాపారం చేస్తున్నట్లు అందులోని మహిళలు వివరించారు. చీరలు, పంచెలు, ఇతర పలు వస్త్రాలను చూపించగా చీరను ఆయన ఆసక్తిగా చూశారు. పక్కన ఉన్న మహిళా అధికారులను వీటిలో ఏ చీర బాగుంటుందో చూడమని కోరిన చంద్రబాబు.. వారు సూచించిన చీరను తీసుకున్నారు. ఖరీదు ఎంత అని నిర్వాహకులను సీఎం అడగ్గా రూ.26,140 అని చెప్పడంతో రూ.25వేలు ఇవ్వాలని తన సిబ్బందికి సూచించడంతోపాటు వ్యాపారం బాగా చేస్తున్నారని మొబైల్ వాహనంలోని మహిళలను నవ్వుతూ అభినందించారు. స్టాల్స్ సందర్శన సందర్భంగా ఒక చోట గుర్రపు డెక్కతో తయారు చేసిన పలు వస్తువులను చూసిన సీఎం అక్కడ టోపీ పెట్టుకొని ఉత్సాహపడ్డారు.

ఎన్నికల నిధులు దుర్వినియోగంపై

చర్యలు నిల్!

- ఇష్టారాజ్యంగా వ్యవహరించిన అధికారులు
- నిబంధనలు బేఖాతర్
- ప్రభుత్వ సొమ్మును వాడుకున్న వైనం
- బకాయిలు అందక నిర్వాహకుల ఇబ్బందులు

దర్శి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : గత ఎన్నికల నిర్వహణ కోసం విడుదలైన నిధుల్లో భారీగా దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు కరువయ్యాయి. ఎంతో నిబద్ధతతో సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించినప్పటికీ కొంతమంది అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. నిబంధనలు తుంగలో తొక్కి నిధులను స్వాహా చేశారు. ఎన్నికల సందర్భంగా అవసరాల కోసం కొనుగోలు చేసిన పర్నిచర్‌ను ఎత్తుకెళ్లారు. భోజనాలు, షామియానాలు ఇతర సదుపాయాలు సమకూర్చిన నిర్వాహకుల్లో ఇంకా కొంతమందికి బిల్లులు పూర్తిగా చెల్లించలేదు. ఎన్నికలు ముగిసి ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ నిధుల దుర్వినియోగంపై పట్టించుకున్న నాథుడే లేడు. దర్శి అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సుమారు రూ.1.70 కోట్లు విడుదలయ్యాయి. ఇతర నియోజకవర్గాలతో పోల్చితే దర్శికి ఎక్కువ నిధులు కేటాయించారు. వాటిని ఇక్కడ విధులు నిర్వహించిన అధికారులు కొంతమంది ఇష్టారాజ్యంగా వాడుకున్నారు. కొంత మొత్తాన్ని వారి అనుచరుల ఖాతాల్లోకి జమచేసి ఏవేవో పనులు చేసినట్లు బిల్లులు చూపించుకున్నారు. వాస్తవంగా పనులు చేసిన నిర్వాహకులకు పూర్తిగా నగదు చెల్లించకుండా వెళ్లిపోయారు. బిల్లులు పెండింగ్‌లో ఉన్న వ్యక్తులు అనేకసార్లు జిల్లా కేంద్రానికి కూడా వెళ్లి అర్జీలు ఇచ్చినప్పటికీ ఫలితం లేదు. దీంతో వారు ఏం చేయాలో పాలుపోక అల్లాడుతున్నారు.

ఫర్నిచర్‌ను ఎత్తుకెళ్లారు!

ఎన్నికల సందర్భంగా కొనుగోలు చేసిన ఫర్నిచర్‌ను ఒక అధికారి ఇక్కడ నుంచి బదిలీపై వెళ్తూ ఎత్తుకెళ్లారు. ఎన్నికల సమయంలో ఉన్నతాధికారులు వస్తారన్న ఉద్దేశంతో ప్రత్యేక నిధులతో ఏసీలు, కంప్యూటర్లు, లక్షలాది రూపాయల విలువచేసే ఫర్నిచర్‌ను కొనుగోలు చేశారు. దానికి లెక్క చెప్పకుండా ఒక అధికారి ఎత్తుకెళ్లారు. ఎన్నికల నిధుల దుర్వియోగం, ఫర్నిచర్ మాయం జరిగిన విషయాలపై రిటర్నింగ్ అధికారిని వివరణ కోరగా ఆవిషయాలతో తమకు సంబంధం లేదని చెప్పారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, సహాయకులు ఆ విషయాలను చూశారని చెప్పారు. ఎన్నికల సమయంలో విధులు నిర్వహించిన అధికారులంతా ఆతర్వాత ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ప్రభుత్వ సొమ్ము దర్జాగా వాడుకున్న అధికారులపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఉన్నతాధికా రులు సైతం ఉదాసీన వైఖరి అవలంబించటం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మను సత్కరిస్తున్న మాజీమంత్రులు, వైసీసీ మహిళా నాయకులు



టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న దామచర్ల నాగసత్యలత, తెలుగు మహిళలు



ఒంగోలులోని మహిళా ఉద్యోగిని సత్కరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

పలు సంస్థలు, సంఘాలు, రాజకీయ పార్టీల కార్యాలయాల్లో నిర్వహణ

ప్రముఖ మహిళలకు సత్కారాలు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమాలు శనివారం ఒంగోలులో పలు సంస్థలు, సంఘాలు, రాజకీయ పార్టీల కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణించిన పలువురు మహిళలను సత్కరించారు.

- జనసేన పార్టీ వీరమహిళా విభాగం ఆధ్వర్యంలో స్థానిక రవిప్రియామాల్‌లో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలత, పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, ఆ పార్టీ నేత కంది రవిశంకర్, మేయర్ గంగాడ సుజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగసత్యలతను ఘనంగా సన్మానించారు. వివిధ రంగాల్లో మంచిసేవలు అందిస్తున్న డాక్టర్ జ్యోష్ణ, నారాయణ స్కూలు కరస్పాండెంట్ కొల్ల సౌజన్య, న్యాయ విభాగంలో నల్రబోలు సుజాత, సేవారంగంలో కోటేశ్వరమ్మలను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

- వైసీపీ కార్యాలయంలో పార్టీ మహిళా అధ్యక్షురాలు దుంపా రవణమ్మ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను మాజీమంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున సత్కరించారు. కార్యక్రమంలో కేవీ.రమణారెడ్డి, దుంపా చెంచిరెడ్డి పాల్గొన్నారు.

- ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో శనివారం మహిళా దినోత్సవం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యం నిర్వహించారు. ఈ సందర్భంగా 50మంది మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి వరకుమార్, రంగారెడ్డి, మసూద్ ఆలీ, ఎస్సీ రమణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సురేష్, ఏసురత్నం, చంద్రశేఖర్, గోపీకృష్ణ, డాక్టర్ రజితమానస, వనజ, సుమతి పాల్గొన్నారు.

- యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు పార్వతీ శాంతి, ఎం.శ్రీదేవి, నాగకళ్యాణి, సంపూర్ణమ్మలను సత్కరించారు. జిల్లా కార్యదర్శి ఎం.సంధ్యారాణి అధ్యక్షతన కార్యక్రమంలో ఎస్.రవి, డి.వీరాంజనేయులు, జి.ఉమా మహేశ్వరి, ఐద్వా జిల్లాకార్యదర్శి రమాదేవి, ఎంఈవో సరస్వతి, నాయకులు చిన్నస్వామి, వెంకటేశ్వరరావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

- డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక చైతన్యస్కూలు ఆఫ్‌నర్సింగ్ కాలేజీలో ఏవో కె.రవీంద్రరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ కె.జ్యోత్స్న ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, డైఫీ జిల్లాకార్యదర్శి కేఎఫ్.బాబు, కిరణ్, రాంబాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో శనివారం మహిళా దినోత్సవ సభకు ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఎం.విజయ అధ్యక్షత వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షురాలు ఎస్.రావమ్మ, కార్యదర్శి అనంతలక్ష్మి, ఆర్.లక్ష్మీ, ఎం.ప్రమీల, సీపీఐ నగర కార్యదర్శి కె వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకులు శ్రీరామ శ్రీనివాసులు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కారయనిర్వహక కార్యదర్శి ఆర్.రామకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో..

ఒంగోలు కార్పొరేషన్: జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలత, మేయర్ గంగాడ సుజాత కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు ఆర్ల వెంకటరత్నం, నాళం నరసమ్మ, బి.అరుణరెడ్డి, మేరీ రత్న కుమారి, గంగవరపు పద్మవతి పాల్గొన్నారు. ఆటల పోటీలలో తెలుగు మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో



వేడుకల్లో పాల్గొన్న వైద్యసిబ్బంది

సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్)లో మహిళా దినోత్సవాన్ని ఏపీ ప్రభుత్వ నర్సుల ఉద్యోగల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మాధవిలత కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఉదయలక్ష్మి, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరి, సూపరింటెండెంట్ ధనలక్ష్మి, ఏవో రమణమ్మ, అసోసియేషన్ కార్యదర్శి కొత్తపల్లి మంజేష్, సభ్యులు జానీబాషా, మహేష్, మొహబూబీ, నాగరాజకుమారి, రమణనాయక్ పాల్గొన్నారు.

పలు సంస్థల ఆధ్వర్యంలో

ఒంగోలు కల్చరల్: మహిళా దినోత్సవ వేడుకలు శనివారం పలు సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, బొమ్మరిల్లు రాజ్యలక్ష్మి, రంగుల సంధ్య, బోను దుర్గ, మాధురి లీనా కుమారి, అక్కురపాటి పద్మావతి, ఇంద్రజ్యోతిలను ఆమె ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, అంగలకుర్తి ప్రసాద్, ధేనువకొండ వెంకటసుబ్బారావు, వాకా సంజీవరెడ్డి, కేవీ.రంగారావు, ఆదిపూడి నరేంద్ర, బేబీరాణి, జాలాది మోహన్, ఏల్చూరి అనంతలక్ష్మి పాల్గొన్నారు.

- ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌లో జరిగిన వేడుకలలో టీవీ టెక్నీషియన్లు చేబ్రోలు సుకన్య, కిలారి రజనీలను సత్కరించారు. సంస్థ గౌరవాధ్యక్షులు మారెళ్ల సుబ్బారావు, అసిస్ట్ ప్రతినిధి వడ్డెంపూడి సుజాతరావు, రెడ్‌క్రాస్ కోసూరి శ్రీదేవి, పొన్నం హరిబాబు, వెంకటేశ్వరరావు, కోనంకి చిరంజీవి, జయరాజ్, ఏబీసీ శ్రీనివాసరావు, శ్యామ్యూల్, విజయ్ పాల్గొన్నారు.

- శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీబాపూజీ గోసంరక్షణశాల ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా, తూనుగుంట మల్లికార్జునరావు, ధనిశెట్టి రామునాయుడు, తుమ్మపూడి బుచ్చిబాబు, ఏడుకొండలు, సామి రాఘవేంద్రరావు, ధనిశెట్టి పావని, బి.విజయరావు, తీగల సత్యవతి, రావూరి శివ, సుజాత పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో..

ఒంగోలు విద్య: మహిళా దినోత్సవం శనివారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు కె.తిరుమల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పి.మాణిక్యాంబ చిత్రపటానికి ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్.మంజుల పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకురాలు శాంతకుమారి, జిల్లాశాఖ ప్రధానకార్యదర్శి డి.శ్రీనివాసులు, పూర్వ కార్యదర్శి విజయసారథి, పరిటాల సుబ్బారావు, శేషారావు, లెవీప్రసాద్, కాట్రగడ్డ రవి, సీహెచ్.పద్మావతి, యోహాన్‌రెడ్డి, నాయబ్‌రసూల్, షేక్ బషీరున్నీసా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రవి మహిళా ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు.

జన శిక్షణ సంస్థాన్..

ఒంగోలు(రూరల్) : జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో గద్దలగుంటలో కార్యాలయంలో మహిళాదినోత్సవం సందర్భంగా మహిళలు కేక్ కట్ చేశారు. ప్రోగ్రామ్ ప్రతినిధి శ్యామ్‌సునీల్, శిక్షకులు టి.లక్ష్మి, ఎం.నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు

సంతనూతలపాడులో...



డాక్టర్ హరిణిని సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

సంతనూతలపాడు: అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సంతనూతలపాడులో పీహెచ్‌సీ వైద్యురాలు పమిడిహరిణి, ప్రైవేట్ ఆసుపత్రి వైద్యురాలు రాధాదేవి, హెచ్‌ఎం సరస్వతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాసవీ మహిళా క్లబ్ సెక్రటరీ ఎస్.జయశ్రీ, ఉపాధ్యక్షురాలు ఎన్.సుకన్యరాణి, క్లబ్ అధ్యక్షులు వీవీ.శేషారావు, సెక్రటరీ వి.ఆంజనేయులు, కోశాధికారి పి.సుధాకర్ పాల్గొన్నారు.

చీమకుర్తిలో..



ఎక్సైజ్ సీఐ సుకన్యను సత్కరిస్తున్న మహిళలు

చీమకుర్తి: మహిళలు ఆర్థికస్వావలంబన సాధించే దిశగా ముందడుగు వేయాలని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోరారు. చీమకుర్తిలోని బీవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో మహిళా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకాయమ్మను కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు ఘనంగా సత్కరించారు. అలాగే పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో సర్కిల్ ఎక్సైజ్ సీఐ సుకన్యను మహిళలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.జవహర్, చలువాది బదరినారాయణ, వెల్లంపల్లి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండలో..



సంబరాల్లో పాల్గొన్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

సింగరాయకొండ: స్థానిక పీహెచ్‌సీలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు లీనా రేపల్‌ను డాక్టర్ చైతన్యకృష్ణ, ధీరేందర్‌కుమార్ ఘనంగా సత్కరించారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన సిబ్బందికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌అలీ, పద్మ, రాజమ్మ పాల్గొన్నారు. స్థానిక విద్యానికేతన్, స్మార్ట్‌జెన్ గ్లోబల్ స్కూల్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.

నేడు సీవీఎన్ రీడింగ్ రూము ఎన్నికలు

ఒంగోలు కల్చరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సీవీఎన్ రీడింగ్ రూము, క్లబ్ కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరుగనున్నాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్, అనంతరం 4 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని ఎన్నికల అధికారి చిల్లర వెంకటసుబ్బారావు శనివారం తెలిపారు. ఇందుకోసం క్లబ్‌లో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. క్లబ్‌లో మొత్తం 970 మంది సభ్యులు ఓటర్లు ఉన్నారన్నారు. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ పదవులతో పాటు ఆరుగురు ఈసీ మెంబర్లను ఓటర్లు ఎన్నుకోనున్నారన్నారు. ఓటు హక్కు వినియోగించుకునే వారు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, ఓటర్లకు క్లబ్ బయట టెంట్లు ఏర్పాటు చేశామని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని సూచించారు. ముఖ్యంగా రెండు ప్యానెళ్ల అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈదుపల్లి గురునాథరావు, ప్రెసిడెంట్‌గా, నితిన్‌రాజ్‌రెడ్డి వైస్ ప్రెసిడెంట్‌గా, కోడూరి రాధాకృష్ణ సెక్రటరీగా పోటీలో ఉన్న ప్యానెల్ ఒకటి కాగా, మిరియాల కృష్ణమూర్తి ప్రెసిడెంట్‌గా బేతంశెట్టి హరిబాబు సెక్రటరీగా పోటీలో ఉన్న ప్యానెల్ మరొకటి. పలువురు స్వతంత్రంగా బరిలో ఉన్నారు.

ఇంటర్ పరీక్షలకు 1,210 మంది గైర్హాజరు

ఒంగోలు విద్య, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 67 పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో శనివారం మొదటి సంవత్సరం విద్యార్థులు 1,210 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు గణితం 1బి, జువాలజీ-1, హిస్టరీ-1 పరీక్ష ప్రశాంతంగాజరిగినట్లు ఆర్ఐవో సైమన్‌విక్టర్ తెలిపారు. పరీక్షలకు 21,158 మందికి గాను 19,948 మంది హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 18,088, ఒకేషనల్ విద్యార్థులు 1860 మంది హాజరయ్యారు. స్క్వాడల్ అధికారులు 51 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

పేస్‌లో ఘనంగా టెక్నికల్ ఫెస్ట్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న శ్రీధర్

ఒంగోలు విద్య, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో సృజన 2కె 25 టెక్నికల్ ఫెస్ట్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు, సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ టెక్నికల్ ఫెస్ట్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఫెస్ట్‌కు వివిధ కళాశాలలనుంచి 150 మంది విద్యార్థులు హాజరై పేపర్ ప్రజంటేషన్, పోస్టర్‌ప్రజంటేషన్, టెక్నికల్ క్విజ్, ప్రాజెక్టు ఎక్స్‌పో తదితర పోటీలలో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్‌లు సీవీ.సుబ్బారావు, ఆర్.వీరాంజనేయులు, కె.రూప అక్కేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం



విద్యార్థినికి పరీక్ష సామగ్రిని అందిస్తున్న పూర్వ విద్యార్థులు

నాగులుప్పలపాడు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని బి.నిడమానూరు జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం షేక్ అబ్దుల్‌కరీమ్‌సాహెబ్ అన్నారు. శనివారం స్థానిక హైస్కూలులో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 1993-94 పూర్వ విద్యార్థులు పరీక్ష సామగ్రిని బహూకరించారు. ఎన్‌సీసీ అధికారి నన్నెబోయిన వెంకటప్పయ్య మాట్లాడుతూ పరీక్షల సమయంలో సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

13 నుంచి బ్రహ్మోత్సవాలు

సంతనూతలపాడు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ప్రకటనలో తెలిపారు. భక్తులు హాజరుకావాలని వారు కోరారు.

రైలు కిందపడి యువకుడు మృతి

టంగుటూరు మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : రైలుకింద పడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి సూరారెడ్డిపాలెం-టంగుటూరు మధ్య చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న జీఆర్పీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయసు 35-40 సంవత్సరాల మధ్య ఉంటుందని, స్కైబ్లూ కలర్ చొక్కా, నేవీ బ్లూ ప్యాంటు ధరించి ఉన్నాడని వారు తెలిపారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ఒంగోలు జీఆర్‌పీ ఎస్సై టి.అరుణకుమారి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సెల్‌నెంబర్: 94406 27647కు తెలియజేయాలని ఆమె కోరారు.

14న జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 14వ తేదీన జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, కంది రవిశంకర్ కోరారు. స్థానిక రవిప్రియామాల్‌లో శనివారం వారు మాట్లాడారు. కార్యక్రమంలో చిట్టెం ప్రసాద్, రాంబాబు, రాయని రమేష్, నాగిశెట్టి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

సంతనూతలపాడు: పిఠాపురంలో ఈనెల 14న జరిగే రాష్ట్రస్థాయి జనసేన పార్టీ ఆవిర్భావసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ బాపట్ల పార్లమెంట్ ఇన్‌చార్జ్ వి.మార్కండేయులు, ఎస్ఎన్‌పాడు సమన్వయకర్త కందుకూరిబాబు కోరారు. శనివారం పేర్నమిట్టలో జరిగిన సమావేశంలో వారు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్పొరేటర్లు రమేష్, మస్తానమ్మ, నూకతోటి ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, నగర కార్యదర్శి కె.వాసు తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి వెలకట్టలేనిది

- జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి




మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి భారతి

ఒంగోలు(రూరల్), మార్చి8(ఆంధ్రజ్యోతి): మహిళా శక్తి వెలకట్టలేనిదని, సెలవులతో సంబంధ లేకుండా నిరంతరం కుటుంబం శ్రేయస్సు, అభివృద్ధి కోసం ఎంతో కృషి చేయడం మహిళలకే సాధ్యమని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎ.భారతి పేర్కొన్నారు. శనివారం ఒంగోలులోని జిల్లా కోర్టు ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా న్యాయాధికారి భారతి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించాలన్నారు. పని ప్రదేశాల్లో మహిళలకు ఏదైనా సమస్యలు ఎదురైతే సంబంధిత కమిటీలకు ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమలో జిల్లా అదనపు న్యాయాధికారులు డి.అమ్మన్నరాజు, డి.రాములు, జి.దీన, కె.శైలజ, జిల్లా న్యాయసేవాధికారి సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ఎస్.హేమలత, జూనియర్ సివిల్ న్యాయాధికారులు పి.భానుసాయి, ఎస్.కోమలవల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సమానత్వం కోసం పోరాడాలి

- పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య



సభలో మాట్లాడుతున్న సంధ్య

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 8(ఆంధ్ర జ్యోతి): సామాజిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక, సమానత్వం కోసం పోరాడేందుకు సన్నద్ధం కావాలని పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రగతిశీల మహిళా సంఘాల విలీనసభ శనివారం స్థానిక ఎన్‌జీవో భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా సంధ్య మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందున్నా మహిళల హోదా పురుషుల కంటే తక్కువగా ఉందన్నారు. కులాంతర, మతాంతర వివాహాలు జరిగినప్పుడు హింసాత్మక దాడులు, పరువు పేరుతో హత్యలు జరగడం సర్వసాధరణమైయ్యాయని ఆరోపించారు. మహిళలపై లైంగిక హింస పెరుగుతూనే ఉందన్నారు. జాతీయ కో ఆర్డినేటర్ ఝాన్సీ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమాసుందరిలు మాట్లాడుతూ దోపిడీ రహిత సమాజం నిర్మాణం కోసం మహిళలు అన్ని ఉద్యమాల్లో ముందుండాలన్నారు. సభా ప్రారంభానికి ముందు నగరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు విష్ణు, బి.పద్మ, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళా కోలాటం విశేషంగా ఆకట్టుకున్నాయి.

వేసవిలో తాగునీటికి ఢోకా లేదు..!

- పూర్తి స్థాయిలో లీకుల నియంత్రణ
- ఎంఈ చంద్రయ్య వెల్లడి



మోటార్లను పరిశీలిస్తున్న ఎంఈ చంద్రయ్య, డీఈ అనిల్

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నగరంలో తాగునీటికి ఢోకా లేదని మునిసిపల్ ఇంజనీర్ చంద్రయ్య తెలిపారు. శనివారం నగరంలోని తాగునీటి సరఫరా విధానం, మోటార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రతి చివరి ఇంటి వరకు తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే అర్ధరాత్రి నీటి సరఫరా విధానానికి స్వస్తి పలికి ఉదయం 5గంటల నుంచి నీటి సరఫరా మొదలై రాత్రి 10 గంటలకు ముగిసేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. సిబ్బందిలో అలసత్వం లేకుండా తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. రెండు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నీరు పుష్కలంగా ఉందని వెల్లడించారు. అలాగే కొన్ని ఏరియాల్లో లీకుల సమస్య తీవ్రంగా ఉన్నందున కొంత సమస్య వస్తుందని, వాటిని గుర్తించేందుకు సచివాలయ సెక్రటరీలకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. వాటిని గుర్తించి వారం, పది రోజుల్లో పూర్తి స్థాయిలో నియంత్రించి నీటి సరఫరాలో ఇబ్బందులు తొలగిస్తామని చెప్పారు. అంతేగాకుండా ట్యాంకర్ల ద్వారా శివారు కాలనీల్లో నీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా ప్రణాళిక రూపొందించామని, కాలనీల్లో నీటి ఇబ్బందులు వస్తే అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని ఎంఈ స్పష్టం చేశారు. ప్రజలు కూడా తమ కాలనీల్లో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

నగరంలో వాటర్ ట్యాంకర్ల డ్రైవర్ల నిరసన

- ఉద్యోగి డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని వెల్లడి
- విచారణ చేసి తొలగించిన కమిషనర్

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ ద్వారా నగరంలోని పలు కాలనీలకు తాగునీరు అందించే నీటి ట్యాంకర్ల డ్రైవర్లు శనివారం నిరసనకు దిగారు. ఈ మేరకు గంటసేపు ట్యాంకర్లు నిలిపివేసి తమ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వివరాల్లోకెళితే.. తాగునీటి సరఫరా విధానంలో మెరుగైన సేవలు అందించేందుకు ఇటీవల ఇంజనీరింగ్ వాటర్ వర్క్స్‌లోని కొందరికి స్థాన చలనం కలిగించారు. అందులో భాగంగా ఇద్దరిని నగరంలోని 50 డివిజన్‌లలో నీటి ట్యాంకర్లపై పర్యవేక్షకులుగా నియమించారు. కాగా ఈ విధుల్లో ఉన్న శ్రావణ్ అనే ఉద్యోగి ట్యాంకర్ డ్రైవర్‌ల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ప్రతి ట్రిప్‌కు రూ.300 ఇవ్వాలని డిమాండ్ చేయడంతోపాటు, ఫొటోలు తీసి బెదిరించడం, తమపై అధికారులకు ఫిర్యాదు చేయడం వంటి వేధింపులకు పాల్పడుతున్నారని డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. గతంలో ఎన్నడూ ఈ విధానం లేదని, ఎవరూ కూడా తమను డబ్బులు డిమాండ్ చేయలేదని తెలిపారు. అలాగే డ్రైవర్లు డబ్బులు ఎందుకు ఇవ్వాలన్నారు. నెల జీతానికి పనిచేసే తాము డబ్బులు ఎలా ఇవ్వగలమని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ట్యాంకర్లు నిలిపి నిరసన తెలియజేయగా, విషయం తెలుసుకున్న ఎంఈ చంద్రయ్య, డీఈ అనీల్ ఫిల్టర్ బెడ్ వద్దకు చేరుకుని డ్రైవర్లతో మాట్లాడి జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. ఈ విషయాన్ని కమిషనరు వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్ళారు. అవినీతికి పాల్పడిన శ్రావణ్‌కుమార్‌ను వెంటనే విధుల నుంచి తొలగించారు. దీంతో ట్యాంకర్ డ్రైవర్లు నీటి ట్యాంకర్లను నడిపి శివారు కాలనీల్లో నీటి ఇబ్బందులు లేకుండా కొనసాగించారు.

ఆంధ్రకేసరి యూనివర్సిటీకి నిధులు కేటాయించాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసర్‌జీ

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి యూనివర్సిటీకి నిధులు కేటాయించి అన్ని డిపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఒంగోలు నగరంలో ఏర్పాటు చేసిన యూనివర్సిటీకి ఇంత వరకు నిర్మాణ పనులు పూర్తి చేయలేదన్నారు. తక్షణమే నిర్మాణ పనులకు నిధులు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పీజీ చదువుతున్న విద్యార్థులకు రామన్ పీజీ ఎంట్రెన్స్ ప్రవేశ పరీక్షను రద్దు చేసి ఏ యూనివర్సిటీకి సంబంధించిన ప్రవేశపరీక్ష వారే నిర్వహించేలా చేయాలని, పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబరు 77ను రద్దు చేయాలన్నారు. యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యువగళం పాదయాత్ర సమయంలో హామీలను అమలు చేయాలని కోరారు. డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు లేక భవిష్యత్‌లో మూతవేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. అందువల్ల విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవన్ కళ్యాణ్, రామాంజి, సురేంద్ర, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను తక్షణమే పూర్తి చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో ఏడేళ్ల క్రితం ప్రారంభించిన టిడ్కో ఇళ్ళ నిర్మాణం తక్షణమే పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్యయాత్రలో భాగంగా సీపీఎం నాయకులు శనివారం నగరంలోని టిడ్కో గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ డిట్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించడంలో అటు వైసీపీ ప్రభుత్వం ఇటు టీడీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే లబ్ధిదారులకు టిట్కో ఇళ్ళు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పి.కల్పన, రఘురాం, తంగిరాల మహేష్, సయ్యద్‌హుస్సేన్, బీవీ.రావు, దామా వెంకటేశ్వర్లు, దామా శ్రీనివాసరావు, సీహెచ్.వినోద్, తిరుపతిరావు, కొండూరి విశ్వనేన్, రాఘవరావు, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

23 మద్యం కేసులు కొట్టివేత

సింగరాయకొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు కోర్టులో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో సింగరాయకొండ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలో నమోదైన 23 మద్యం కేసులను (డీపీఎల్) కొట్టివేసినట్లు ఎక్సైజ్ సీఐ మేడికొండ శివకుమారి తెలిపారు. కేసుల్లో నిందితులుగా ఉన్న వారి నుంచి రూ.1,64,130 నగదు చలానా రూపంలో ప్రభుత్వ ఖజానాకు జమ చేయించినట్లు వివరించారు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్కాపురంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబుతో మహిళామణులు


మహిళా రక్షణ కోసం ఏర్పాటు చేసిన శక్తిటీంల

ఎంవోయూలు, పథకాల ప్రారంభం

మార్కాపురం సభలో సీఎం చంద్రబాబు

మార్కాపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మార్కాపురంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మహిళల అభివృద్ధి, సంక్షేమం, సాధికారత, భద్రతకోసం పలు సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకున్నారు. దీంతో పాటు పలు పథకాలు, కార్యక్రమాలను ప్రారంభించారు. ముందుగా ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం సెర్ప్, మెప్మా, ఎంఎస్ఎంఈ విభాగంలో అవకాశాలు, స్వయం ఉపాధి, ఆర్థిక వెసులుబాటు కల్పించి లక్షమంది మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలను అమలుజేస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయా శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు.


ఫైబర్ క్రాఫ్ట్ స్టాల్‌ను పరిశీలించి అందులోని వస్తువుల గురించి వివరాలు తెలుసుకుంటున్న చంద్రబాబు

మెప్మాలోని 30వేల మందిలో 10 వేల మందిని ర్యాపిడో, 4 వేల మందిని స్వయం ఉపాధి పథకాల్లో, 4 వేల మందిని కేంద్ర ప్రాయోజిత పథకాల్లో, 4 పర్యాటక అనుబంధ రంగాల్లో, 4 వేల మందిని తృప్తి హోటల్స్ స్థాపన, 2 వేల మందిని స్మార్ట్ స్ట్రీట్స్ వెండింగ్ జోన్‌లో, మరో 2 వేల మందికి టిడ్కో జీవనాధారం కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయాధారిత ఉత్పత్తుల తయారీ రంగం, సేవారంగం, వ్యాపారాల్లో మహిళల జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఎంఎస్ఎంఈ రంగంలో 10 వేలమంది మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు 2025-26 సంవత్సరానికి కార్యాచరణ విడుదల చేశారు. మహిళలు, పిల్లల భద్రతే లక్ష్యంగా డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ఐజీ వి.రాజకుమారిలతో కలిసి శక్తిటీంలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ శక్తిటీం బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, పిల్లలపై వేధింపులను అరికట్టడం, నేరాలను నిరోధిస్తోందన్నారు. తక్షణసాయం అందించి రక్షణ కవచంగా నిలుస్తుందన్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు చేనేత రథాలను, 1.5 లక్షల మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మెప్మా ఆధ్వర్యంలో 7,471 మంది పట్టణ పేదలకు రూ.645.52 కోట్లు బ్యాంకు రుణాలను పంపిణీ చేశారు. దీనిద్వారా ఒక్కో మహిళకు రూ.50 వేల నుంచి రూ.రెండు లక్షల వరకు రుణం అందుతుందన్నారు. 1.43 లక్షల గ్రామీణ మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా ఉత్పాదక రుణాల పథకం కింద రూ.1,826.43 కోట్లు, స్త్రీనిధి సంస్థ కింద రూ.వెయ్యి కోట్ల మంజూరుకు సంబంధించి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. డ్వాక్రా సంఘాల ఉత్పత్తుల విక్రయాలకు ఫ్లిప్‌కార్ట్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ సహకారంతో వ్యవసాయాధారిత ఉత్పత్తులకు వ్యాల్యూచైన్ ఒప్పందం కుదిర్చారు. చిన్నతరహా హోటల్స్ వ్యాపారంలో డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించడానికి గాటోస్ కేఫ్‌తో ఒప్పందం కుదిరింది. సర్వీస్ ప్రొవైడర్ల జీవనోపాధి అవకాశాలు పెంపొందించడానికి హోమ్ ట్రయాంగిల్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనిద్వారా రాష్ట్రవ్యాప్తంగా 18,515 సర్వీస్ ప్రొవైడర్లకు ప్రయోజనం చేకూరనున్నట్లు తెలిపారు. గ్లోబల్ మార్కెట్‌లో అరకు కాఫీ ఉత్పత్తులను పెంచేందుకు నేచర్ అరకు కాఫీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. తొలి విడతలో 100 అరకు కాఫీ లేఅవుట్‌లను ఏర్పాటు చేసి డ్వాక్రా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. రాష్ట్రంలోని 55,607 మంది అంగన్‌వాడీ వర్కర్లకు, 49,909 మంది హెల్పర్లకు మేలు జరిగేలా గ్రాట్యూటీ అమలును ప్రకటించారు. దీనిద్వారా అంగన్‌వాడీ వర్కర్‌కు రూ.1.79 లక్షలు నుంచి రూ.2.32 లక్షల వరకు, హెల్పర్‌కు రూ.1.09 లక్షల నుంచి రూ.1.41 లక్షల వరకు లబ్ధిచేకూరుతుందని తెలిపారు. దీనిద్వారా ప్రభుత్వంపై ఏటా రూ.17.73 కోట్ల భారం పడనున్నట్లు వెల్లడించారు. గత ఏడాది జూన్ నుంచి అమలు చేసే గ్రాట్యూటీకిగాను రూ.1.90 కోట్లను విడుదల చేశారు. పీఎం విశ్వకర్మ పథకం కింద వెయ్యి మంది మహిళలకు రూ.లక్ష మేర రుణాల చెక్కులను అందజేశారు. కార్యక్రమాల్లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, గిరిజన సంక్షేమశాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, బీసీ వెల్ఫేర్ సెక్రటరీ కె.సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఎండీ ఎ.మల్లిఖార్జునరావు, ఈడీ ఎం.వెంకటేశ్వరరావు, మెప్మా ఎండీ ఎన్.తేజభరత్, స్టేట్ మిషన్ మేనేజర్ జి.రంగనాయకులు, సెర్ప్ సీఈవో వీ.కరుణ, డీఆర్‌డీఏ రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు.


మెప్మాతో చేసుకున్న ఎంవోయూలతో ముఖ్యమంత్రి చంద్రబాబు

సీఎంకు ఘన స్వాగతం

తర్లుపాడు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉండవల్లి నుంచి మార్కాపురం వచ్చిన సీఎం నారా చంద్రబాబు నాయుడుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. మార్కాపురంలో హెలికాప్టర్ ఉదయం 11.37 గంటలకు ల్యాండ్ అయ్యింది. 11.56 గంటల వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు.

రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, మార్కాపురం, ఒంగోలు, గిద్దలూరు, కనిగిరి, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, దామచర్ల జనార్దన్ , ముత్తుముల అశోక్ రెడ్డి, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, బీఎన్ విజయ్‌కుమార్, దర్శి ఎర్రగొండపాలెం టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జ్‌లు గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్ బాబు, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, ఏపీ అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాసులరెడ్డి, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, కలెక్టర్ తమీమ్ అన్సారియా, సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఎస్పీ ఏఆర్ దామోదర్, జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్, బీజేపీ మార్కాపురం నియోజకవర్గ కన్వీనర్ పీవీ కృష్ణారావు, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు. మార్కాపురం నుంచి సాయంత్రం 5.42 నిమిషాలకు బయలుదేరి ఉండవల్లికి సీఎం చంద్రబాబు వెళ్లారు.


హెలిప్యాడ్ వద్ద సీఎం రాక కోసం ఎదురుచూస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు


ముఖ్యమంత్రి చంద్రబాబు చూసి ఉత్సాహంతో కేరింతలు, ఫొటోలు తీసుకుంటున్న యువకులు

పోలేరమ్మ గుడిలో చంద్రబాబు పూజలు

- పూర్ణ కుంభంతో స్వాగతం పలికిన అర్చకులు, ఆలయ సిబ్బంది
- సీఎంను చూసిన ఆనందంతో యువత, మహిళల కేరింతలు

మార్కాపురం రూరల్, మార్చి8 (ఆంధ్రజ్యోతి). మార్కాపురంలోని తర్లుపాడు రోడ్డు వైపు ఉన్న కొండేపల్లి రోడ్డులో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద సీఎం చంద్రబాబు నాయుడు దిగారు. అక్కడ నుంచి ప్రత్యేక బస్సులో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి తర్లుపాడు రోడ్డులోని శ్రీ అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారులు, సిబ్బంది పూర్ణకుంభంతో మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు. ఆలయంలో అల్లూరి పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకుని సీఎం చంద్రబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వెలుపల కోలాటం చేస్తున్న చిన్నారులు, సన్నాయి మేళాలతో స్వాగతం పలికిన నాయీ బ్రాహ్మణుల వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. వారితో కలిసి ఫొటోలు దిగారు. రోడ్డుపై కాన్వాయ్‌లోని ప్రత్యేక బస్సులో ఉన్న సీఎం చంద్రబాబును చూసి యువతీ యువకులు, మహిళలు ఉత్సాహంతో కేరింతలు కొడుతూ 'జై చంద్రబాబు జై టీడీపీ' అంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కొందరు మహిళలు ఆనందంతో విక్టరీ సింబల్ చూపిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.


పోలేరమ్మ గుడిలో పూజలు చేస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి


చంద్రబాబును చూసిన ఆనందంతో నవ్వుతూ విజయసంకేతం చూపుతున్న మహిళలు

నాగలితో వచ్చిన కార్యకర్త

మార్కాపురంలో టీడీపీ కార్యకర్తల సమావేశానికి పెద్దారవీడు మండలం శివాపురం గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి వినూత్నరీతిలో వచ్చారు. నాగలిని భుజాన పెట్టుకుని కార్యకర్తల సమావేశానికి రావడం పలువురుని ఆకర్షించింది.



- మార్కాపురం ఆంధ్రజ్యోతి



మహిళా దినోత్సవం సందర్భంగా నృత్యప్రదర్శన చేసిన చిన్నారులతో చంద్రబాబు

భావనారాయణునికి భానుడి అభిషేకం

పెదగంజాం(చినగంజాం), మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : భావనారాయణుని భానుడు అభిషేకించిన అద్భుత ఘట్టం మండలంలోని పెదగంజాం గ్రామంలో శనివారం ఉదయం ఆవిష్కృతమైంది. ప్రతి ఏటా మార్చి మొదటి వారం, సెప్టెంబర్ చివరివారంలో భూనీల సమేత భావనారాయణ స్వామి ఆలయంలోని స్వామి వారిని సూర్యకిరణాలు తాకడం పరిపాటి. శనివారం ఉదయం 6.35 గంటల నుంచి 6.40 గంటల సమయంలో మూలవిరాట్‌ని భానుని లేలేత కిరణాలు అభిషేకించాయి. భక్తులు అధిక సంఖ్యలో సూర్యోదయానికి ముందే ఆలయానికి వచ్చి ఈ దృశ్యాలు చూసి ఆశ్చర్యచకితులయ్యారు. వాతావరణం సరిగా లేవపోవడంతో స్వామి వారిని కొంత భాగం మాత్రమే సూర్యకిరణాలు తాకాయని పూజారి బృందావనం రాఘవాచార్యులు తెలిపారు. మంగళవారం వరకు సూర్యకిరణాలు స్వామిని తాకుతాయని ఆలయ అర్చకులు తెలిపారు.



మూలవిరాట్‌ను అభిషేకిస్తున్న సూర్యకిరణాలు

టూరిజం అభివృద్ధికి పటిష్ట చర్యలు

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : టూరిజం అభివృద్ధికి పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శనివారం నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో టూరిజం అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణ, సౌకర్యాలు, సందర్శకులకు వసతులు, తాగునీటి అవసరాలు, దుస్తులు మార్చుకునే గదులు, బీచ్ బెంచ్‌లు, ప్రథమ చికిత్స కేంద్రం, భద్రత, సీసీ కెమెరా నిఘా, అప్రోచ్ రోడ్లు, ప్రత్యేక పార్కింగ్ వంటి అంశాలపై ప్రతిపాదన జరిగినట్లు వివరించారు. క్రమంలోనే సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో టూరిజం డీఈ శ్రీనివాస్, ఆర్కిటెక్ ఇంజనీర్ సాజిత్, సూపరింటెండెంట్ ఇంజనీర్ ఈశ్వరయ్య, రిసార్ట్స్ మేనేజర్ అశోక్ ఉన్నారు.


టూరిజం అధికారులతో ఎమ్మెల్యే కొండయ్య

అవీ..ఇవీ

రాజీ మార్గం రాజ మార్గం



మాట్లాడుతున్న న్యాయాధికారి శుభవాణి

మార్కాపురం వన్ టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాజీ మార్గం రాజమార్గం అని ఆరవ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శుభవాణి అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగ ణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి శుభవాణి మాట్లాడారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే సమయం, ధనం ఆదా అవుతుందన్నారు. అనంతరం లోక్ అదాలత్‌లో 26 సివిల్, 46 క్రిమినల్, 131 ఎక్సైజ్, 10 మోటార్ యాక్సిడెంట్ కేసులు, 7 చెక్ బౌన్స్ కేసులు, 1 మనోవర్తి కేసు, 1 గృహ హింస కేసు, 512 పెట్టీకేసులు కలిసి మొత్తం 734 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.దేవేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.కిషోర్‌కుమార్, బార్ అసోసియన్ అధ్యక్షులు పి.కాశయ్య, న్యాయవాదులు షేక్ బేగం, కరిమున్నీసీ, వెలుగొండయ్య, ఎన్.అశోక్‌నాయక్, షేక్ జహీర్, ఏ.ఝాన్సీ రాణిలు లోక్ అదాలత్ సభ్యులుగా వ్యవహరించారు. లోక్‌అదాలత్‌లో న్యాయవాదులు, పోలీసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వసతిగృహాన్ని సందర్శించిన న్యాయాధికారి

స్థానిక బీసీ వెల్ఫేర్ మహిళా వసతిగృహంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని 6వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శుభవాణి ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలో అభ్యసించే సమయంలోనే మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. దీంతో ప్రస్తుత సమాజంలో జరుగుతున్న మోసాల గురించి తమను తాము రక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో న్యాయవాది ఆకుల ఉషశ్రీ, వార్డెన్ కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 133 కేసులు పరిష్కారం

గిద్దలూరుటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శనివారం గిద్దలూరు కోర్టు భవనాల సముదాయంలో జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 133 కేసులు పరిష్కరించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. న్యాయవాదులుగా జి.ఆనంద్ కుమార్, ఎం.పిచ్చయ్య బెంచ్ సభ్యులుగా వ్యవహరించారు. మొత్తం 133 కేసులలో 23 సివిల్ కేసులకు గాను రూ.64,51,141, 27 క్రిమినల్ కేసులకు రూ.21,60,000, 76 ఎక్సైజ్ కేసులకు గాను రూ.4,75,710, 5 టెలిఫోన్ పీఎల్‌సీకి రూ.2300, రెగ్యులర్ పీఎల్‌సీ రెండు కేసులు పరిష్కరించారు. మొత్తం రూ.90,89,151 పరిహారంగా అందించారు.

సమాజంలో స్త్రీల పాత్ర కీలకం

గిద్దలూరు టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో ప్రతి వ్యవస్థలో స్త్రీలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా స్థానిక కోర్టు భవనాల సముదాయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జడ్జి ఓంకార్ మాట్లాడుతూ కుటుంబంలోనూ, విధి నిర్వహణలోనూ బాధ్యతలను బ్యాలెన్స్ చేసుకుంటూ మహిళలు ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.శేషశైనారెడ్డి, సీనియర్ న్యాయవాదులు పి.రాజశేఖర్‌రెడ్డి, కె.హిమశేఖర్‌రెడ్డి, ఎస్.వి.నాగేంద్రబాబు, సీ.హెచ్.పోలయ్య, వీ.వెంకటరామిరెడ్డి, బార్ అసోసియేషన్ ట్రెజరర్ ఎం.రంగారెడ్డి, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పెట్రోల్ దాడిలో గాయపడిన మహిళ మృతి

పెద్దదోర్నాల, మార్చి 8(ఆంధ్రజ్యోతి):మండలంలోని పెద్ద బొమ్మలాపురం గ్రామంలో స్థలం వివాదంలో శుక్రవారం చేసిన పెట్రోల్ దాడిలో గాయపడిన దూదేకుల నూరజాన్‌బీ(54) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. కొంత కాలంగా సెంటున్నర స్థలంపై దూదేకుల నాగూర్‌వలి, కాశీంపీరా కుటుంబానికి జరుగుతున్న వివాదంలో భాగంగా శుక్రవారం చలిమంట కాచుకుంటున్న నాగూర్‌వలి, ఆయన పెద్దమ్మ నూరజాన్‌బీపై కాశీంపీరా పెట్రోల్‌తో దాడి చేసిన ఘటనలో తీవ్రంగా గాయపడి ఒంగోలు రిమ్స్‌లో చికిత్సలు పొందుతూ ఇద్దరూ మృతి చెందారు.

ఘనంగా విగ్రహప్రతిష్ఠ



స్వామివారి మూలవిరాట్

కొమరోలు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడమకల్లు గ్రామంలో శనివారం కల్యాణ, పట్టాభిరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా అభిషేకాలు, నవగ్రహ హోమాలు చండీ హోమాలు మూలమంత్ర హోమాలను దంపతులతో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటుచేసిన యాగ శాలలో దంపతులతో నియమనిష్ఠలతో హోమాలను నిర్వహించారు. సీతారామస్వాముల నూతన విగ్రహాలను జలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమాలను గిద్దలూరు నియోజకవర్గం టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి వేదపండితులు స్వాగతం పలుకగా, వారికి వేదపండితులు పత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాష్ట్రస్థాయి ఎడ్లబలప్రదర్శన పోటీలను నిర్వహించి, బహుమతులను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కడపజిల్లా ఎడ్ల సత్తా

కొమరోలు : కొమరోలు మండలంలోని ఇడమకల్లు గ్రామంలో నుతనంగా నిర్మించిన శ్రీ కళ్యాణరామ పట్టాభిరామస్వామి ఆలయ జీర్ణోధరణ, ధ్వజ, శిఖరకలశ, విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యాక్రమంలో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్లబలప్రదర్శన పోటీల్లో కడప జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి, సుంకి సురేంద్రరెడ్డిల ఎడ్ల జత ప్రథమ బహుమతి లక్ష రూపాయలను గెలుచుకొంది. ఈ పోటీలను గిద్దలూరు నియోజకవర్గం టీడీపీ నాయకులు ముత్తుముల క్రిష్ణకిషోర్‌రెడ్డి తొలికాడిని ప్రారంభించారు. ద్వితీయ బహుమతి రూ.80వేలను కడప జిల్లా చౌటపల్లెకు చెందిన మార్తాల చంద్రఓబుల్‌రెడ్డి ఎడ్లజత, తృతీయ బహుమతిని రూ.50వేలను బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన వీరాస్వామి చౌదరి ఎడ్లజత, నాల్గోవ బహుమతి రూ.30వేలను నంద్యాల జిల్లా జిల్లెల్ల గ్రామానికి చెందిన దినేష్‌రెడ్డి ఎడ్లజత గెలుచుకొన్నాయి. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన రమేష్, గురివిరెడ్డిలకు చెందిన ఎడ్లజత కడప జిల్లా చౌటపల్లెకు చెందిన మార్తాల చంద్రఓబుల్‌రెడ్డి ఎడ్లజతలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. కార్యక్రమంలో యాంకర్ సీ నారాయణస్వామి పాల్గొని ప్రజలను ఉత్తేజపరిచారు.

మురుగునీటి శుద్ధికేంద్రానికి నేడు శంకుస్థాపన

గిద్దలూరు టౌన్ : పట్టణంలోని ముండ్లపాడు రోడ్డులో ఈ నెల 9న ఉదయం 8గంటలకు మురుగునీటి శుద్ధికేంద్రానికి (ఎస్‌టీపీ) ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.

బియ్యం అందజేత

గిద్దలూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీఆర్.కాలనీలో సంజీవిని అనాథ వృద్ధాశ్రమానికి యువ ప్రగతిపథం స్వచ్ఛంద సంస్థ బియ్యాన్ని అందజేసింది. అందులో ఉంటున్న వృద్ధులకు, విద్యార్థులకు పండ్లు, బ్రెడ్లు అందచేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు పగిడి వేణుగోపాల్, సంస్థ ప్రతినిధులు రత్నం, నాగరాజు, శ్రీనివాసులు తదితరులతోపాటు ఆశ్రమం నిర్వాహకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

మహిళల సమగ్రాభివృద్ధే ధ్యేయం

- విజన్- 2047లో మహిళామణులదే కీలకపాత్ర వెలిగొండ పూర్తి
- మార్కాపురం జిల్లా తప్పకుండా చేస్తా
- ప్రతి ఇంటి నుంచి ఒక మహిళా వ్యాపారవేత్త
- మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు



మహిళల ప్రశ్నలకు సమాదానం ఇస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

పెద్దారవీడు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళల సమగ్రాభివృద్ధే తన ధ్యేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మార్కాపురంలో మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సమాదానమిచ్చారు. వారికి తనదైనశైలిలో నవ్వుతూ ఆహ్లాదకర వాతావరణంలో సమాదానాలిచ్చారు. మహిళలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు తనకున్న విజన్‌ను ఆవిష్కరించారు. పలువురు మహిళలు అడిగిన ప్రశ్నలు ఇలా..

ప్రశ్న: **గతంలో ఉమ్మడి రాష్ట్రంలో వెనుకబడిన ఆడబిడ్డ చదువును ప్రోత్సహించేందుకు సైకిళ్లు పంపిణీ చేశారు. మీ ఆశయం నెరవేరింది అనుకుంటున్నారా..?** సుమతి, బసవన్నపాలెం, కొనకనమిట్ల మండలం

సీఎం:ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు: గతంలో 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశాం. ఆడబిడ్డల్లో శక్తిని బయటకు తీసి ప్రోత్సహించేందుకే అలా చేశాం. అంతకుముసుపు 8వ తరగతికి రాగానే బాలికలు బడి మానేసేవాళ్లు. సైకిళ్ల పంపిణీ చేపట్టిన తర్వాత ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినుల సంఖ్య పెరిగింది. ఉత్తీర్ణత శాతం పెరిగింది. విద్యార్థినులు విద్యాపరంగా ముందుకు సాగుతున్నారు.

ప్రశ్న: **మీరు గతంలో డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేశారు. అవి ఏర్పాటు చేయాలన్న తలంపు ఎలా వచ్చింది.?** మెహరున్నీసా, పొదిలి

సీఎం : పనిచేయని మహిళలంటే సమాజంలో చులకనబావం ఉండేది. ఆర్థికంగా మహిళలు స్థిరంగా ఉంటేనే వారికి గుర్తింపు ఉంటుందని బావించా. దీనికోసం తొలుత డ్వాక్రా మహిళలకు పొదుపు ఉత్తమమని ప్రారంభించాం. పాడి, పశువులు చిన్నవ్యాపారాలు పెట్టుకున్నారు. ఆర్థికాభివృద్ధి సాధించి పిల్లల్ని ఉన్నత చదువులు చదివిస్తున్నారు. దీంతో గౌరవం పెరిగింది. రానున్న రోజుల్లో మీ ఊర్లోనే మీరు కూర్చుని డబ్బులు సంపాదించాలి. మీ శక్తిని ఉపయోగించి జీవన ప్రమాణస్థాయిని పెంచుతాం.

ప్రశ్న: **వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా ఎలాంటి అవకాశాలు వస్తాయి, ఆదాయం ఎలా పెరుగుతుంది.?** మీనాక్షి, సంతనూతలపాడు

సీఎం: ప్రపంచంలో పనిచేసే సమయాలలో, విధానాలలో మార్పులు వచ్చాయి. కరోన వచ్చిన తర్వాత ఇంటి నుంచి పనిచేసే విధానానికి శ్రీకారం చుట్టారు. సంస్థలు మీ ఇంట్లోనే కూర్చుని డబ్బులు సంపాదించే అవకాశాలు కల్పిస్తున్నాయి. ప్రభుత్వం కూడా గ్రామీణ ప్రాంతాల్లో వర్క్ సెంటర్లను ఏర్పాటు చేయనుంది. కొత్తకొత్త కోర్సులు నేర్పించి నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాం. కంపెనీలను తెచ్చే బాధ్యత నాది. పనిచేసే బాధ్యత మీది. అదనపు ఆదాయం సంపాదించే మార్గాలను చూస్తున్నాం. ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా అన్ని సేవలు ఇంట్లోకే వస్తున్నాయి.

ప్రశ్న: ఇటీవల కాలంలో పిల్లల్ని ఎక్కువమందిని కనమని చెబుతున్నారు. కారణం ఏమిటి.? **యాంకర్ భార్గవి**

సీఎం: ప్రపంచంలో సంపాదన సృష్టిస్తే డబ్బులు వస్తాయి. కానీ వాటిని వినియోగించుకోవడానికి మానవ వనరులు తగ్గుతున్నాయి. ఐటీ రంగంలో భార్య, భర్త పనిచేస్తున్నారు. పిల్లలు భారం అనుకుంటున్నారో ఏమో కనేందుకు మొగ్గు చూపడంలేదు. చైనా, జపాన్‌లాంటి దేశాల్లో జనాభా తగ్గుముఖం పట్టింది. ఆయా దేశాల్లో సంపదను అనుభవించడానికి కూడా వారసులు లేని పరిస్థితి ఉంది. ఉత్తరంతో పోల్చితే దక్షిణ భారతదేశంలోనే జనాభా పెరుగుదల తగ్గింది. గతంలో విజన్- 2020లో భాగంగా జనాభాను తగ్గించాలని నేనే చెప్పాను. కానీ నేడు విజన్-2047లో భాగంగా దేశశ్రేయస్సు దృష్ట్యా పిల్లల్ని కనమని చెబుతున్నా. ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా తల్లికివందనం పథకం కింద రూ.15 వేలు అందజేస్తా. ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కుమంది పిల్లల్ని కంటే అదనపు సౌకర్యాలు కల్పిస్తా.

ప్రశ్న : **ఇంటికో మహిళా పారిశ్రామికవేత్తను ఎలా తయారు చేస్తారు.?** పరిమళ సుహాసిని, తిమ్మసముద్రం, ఎన్‌జీపాడు మండలం

సీఎం: ప్రతి వ్యక్తికి సంకల్పం ఉండాలి. సంకల్పం ఉంటే సాధించడం కష్టమేమి కాదు. నేను పీజీ చదువుతున్నప్పుడు ఎమ్మెల్యే కావాలనుకున్నాను. చంద్రగిరి నియోజకవర్గంలో వారంలో రెండు రోజులు ప్రజల వద్దకు తిరిగాను. సంకల్పించిన మూడేళ్లలో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాను. తర్వాత రెండు సంవత్సరాలకు మంత్రిని అయ్యాను. ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేయడానికి నూతనంగా ప్రారంభించనున్న టాటా ఇన్నోవేషన్ హబ్ ఎంతగానో ఉపయోగపడుతుంది. పిల్లల్ని చదివించమని చెబుతున్నా. ప్రతి నియోజకవర్గానికి ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తాను. పారిశ్రామికవేత్తలుగా ముందుకు వచ్చే మహిళలకు పరిశ్రమల ఏర్పాటులో 45 శాతం రాయితీ ఇస్తాను. నేర్చుకోవడం అనేది జీవితాంతం అమల్లో ఉండాలి.

ప్రశ్న : **మహిళల ఆదాయంలో టెక్నాలజీ ఎలా ఉపయోగపడుతుంది.?** పూర్ణిమ, ఒంగోలు

సీఎం: ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానం అన్నిరంగాలకు విస్తరించింది. సెల్‌ఫోన్ ప్రతి ఒక్కరికీ తప్పనిసరైంది. నాల్డెడ్, ఎకానమి, టెక్నాలజీలు జీవనవిధానంలో భాగమయ్యాయి. టెక్నాలజీ వల్ల ఖర్చుతగ్గి ఆదాయం పెరుగుతోంది. సెల్‌ఫోన్‌ను ఉపయోగించే ఈ-కామర్స్ ద్వారా ఎన్నో వ్యాపారాలు చేయవచ్చు. మహిళలు సాంకేతికతను అందిపుచ్చుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చు.

ప్రశ్న : **భార్యగా, మహిళా పారిశ్రామికవేత్తగా మీ అర్ధాంగికి ఎన్ని మార్కులు ఇస్తారు.?** యాంకర్ భార్గవి

సీఎం: భువనేశ్వరికి తొలుత వ్యాపారం చేయడం అంటే తెలియదు. ఆమెకు ఆ అవసరం లేదు. నేను మంత్రి ఉన్నప్పుడు వ్యాపారాలు ప్రారంభించా. ఒకవైపు రాజకీయాల్లో ఉంటూ వ్యాపారాలు చేయడం కష్టంగా మారింది. ఈ విషయాన్ని భువనేశ్వరికి తెలిపి వ్యాపారం చూసుకునేలా ఒప్పించా. ఒకవైపు లోకేష్‌ను తీర్చిదిద్దడమే కాక వ్యాపారాలను కూడా సమర్థవంతంగా నిర్వహించింది. నేడు హెరిటేజ్ సంస్థ ఈ స్థాయిలో ఉందంటే నా అర్ధాంగి కృషి ఫలితమే. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏదీ ఉండదు.

ప్రశ్న : **పశ్చిమ ప్రకాశంలో తాగు, సాగునీటి అవసరాలను తీర్చే వెలిగొండ ప్రాజెక్టుకు ఎప్పుడు నీళ్లిస్తారు.** గుండ్లాపల్లి సుజాత, పెదారికట్ల

సీఎం : 'మాజీ సీఎం ప్రాజెక్టును జాతికి అంకితం చేశాడు కదా.. నీళ్లు కూడా ఇచ్చాడు కదా..!' (వ్యంగ్యంగా). వెలిగొండ ప్రాజెక్టుకు నేనే ఫౌండేషన్ వేశా. నేనే ప్రారంభించి నీళ్లిస్తా. అత్యంత వెనుకబడిన ప్రాంతం ఇది. నీళ్లు ఇవ్వడం నా బాధ్యత. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడమే కాకుండా సముద్రంలో కలిసే గోదావరి జలాలను కూడా ఈ ప్రాంతానికి తీసుకొస్తాను.

ప్రశ్న : **మూడేళ్లుగా ఛానల్స్‌లో బూతులు, తిట్లు వస్తున్నాయి. మహిళల రక్షణకు ఎటువంటి భరోసా ఇస్తారు.?** యశస్వి, కిట్స్ కాలేజీ, విద్యార్థిని

సీఎం : మహిళలు అధైర్యపడొద్దు. ఆడబిడ్డలు గడిచిన ఐదేళ్లలో చాలా ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలో గంజాయిని ఒక పంటగా సాగు చేశారు. ఎక్కడ చూసినా గంజాయి విక్రయాలు జరిగేవి. సాంకేతిక పరిజ్ఞానంతో గంజాయి ఉనికి లేకుండా చేయడానికి పనిచేస్తున్నాం. డ్రోన్ల సహాయంతో గంజాయి సాగుచేసిన ప్రాంతాలను గుర్తిస్తున్నాం. గంజాయి మత్తులో అరాచకాలు సృష్టించే వారినుంచి మహిళల రక్షణకు శక్తి యాప్‌ను తీసుకొచ్చాం. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా శక్తి యాప్‌లో సందేశం పంపితే బాధ్యతలపై కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : **మీ ముఖంలో అలసట కనిపించదు. ప్రశాంతంగా ఉంటారు. ఎలా సాధ్యం.?** సరళి, మెడికల్ కాలేజీ స్టూడెంట్, ఒంగోలు

సీఎం: నిద్రలేచినప్పటి నుంచి పడుకునే వరకు నాకు అలసట ఉండదు. తెలుగు జాతిని ఉన్నతస్థితిలో చూడటమే నా కోరిక. మంచివాన్ని అని అనిపించుకోవడానికి అనునిత్యం పనిచేస్తాం. తిండి, ఆలోచనలు మంచిగా ఉంటే మనస్సు ఆనందంగా ఉంటుంది. పడుకున్న వెంటనే రెండు నిమిషాల్లో నిద్రపోతాను. ప్రస్తుతం రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం రూ.2.68 లక్షలు. 2047 నాటికి రూ.58 లక్షలు చేయడమే లక్ష్యం. ఆ విధంగా పెరగాలి ఉంటే ప్రతి ఏడాది 15 శాతం చొప్పున పెరుగుల రేటు ఉండాలి. సంపద, ఆరోగ్యం, ఆనందం ఉంటే అంతా బాగుంటుంది.

ప్రశ్న :మార్కాపురం జిల్లాను ఎప్పుడు ఏర్పాటు చేస్తారు.? రిషిత, సాధన కాలేజీ విద్యార్థిని, మార్కాపురం

సీఎం: ఎన్నికల సమయంలో మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చా. జిల్లా హామీని తప్పక నెరవేరుస్తా. జిల్లా ఏర్పాటుతోపాటు తక్షణమే ఈ ప్రాంత విద్యాభివృద్ధికి ప్రభుత్వం డిగ్రీ, పీజీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం.

ధీరవనితలను ఆదర్శంగా తీసుకోవాలి :సీఎం



ధీరవనితల వేషధారణలో ఉన్న చిన్నారులతో చంద్రబాబు

మార్కాపురం రూరల్, మార్చి8 (ఆంధ్రజ్యోతి) : ధీరవనితలను విద్యార్థినులు ఆదర్శంగా తీసుకోవాలని సీఎం నారా చంద్రబాబునాయుడు సూచించారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా స్థానిక సాయి బాలాజీ స్కూల్ ఎదురుగా స్థలంలో ప్రభుత్వం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఝాన్సీలక్ష్మీ భాయి, కల్పన చావ్లా, మేరికోం, ఎంఎస్ సుబ్బలక్ష్మీ, శకుంతలాదేవి, యామిని కృష్ణమూర్తి, సరోజిని నాయుడు, సావిత్రి భాయిపూలె, మొల్ల, మదర్‌థెరిస్సా పీవీ.సింధు, భారత మాత, ద్రౌపతి ముర్ముల వేషధారణలో విద్యార్థినులు ఆకట్టుకున్నారు. సీఎం వారిని అప్యాయంగా పలకరించి వారితో ఫొటో దిగారు.

ప్రతిభాశీలురైన మహిళలకు ముఖ్యమంత్రి సన్మానం

మార్కాపురం : పలు రంగాల్లో ప్రతిభచాటిన మహిళా మణులను అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా సీఎం నారా.చంద్రబాబునాయుడు ఘనంగా సన్మానించారు. పద్మశ్రీ అవార్డుగ్రహీత డి.సుమతీరామోహన్‌రావు, కూచిపూడి కళాకారిణి, కళారత్న శారదారామకృష్ణ, జర్నలిస్టు ప్రసూన, సాంస్కృతిక నిర్వాహకురాలు పరుచూరి విజయలక్ష్మీ, హరికథా ప్రవచనకర్త డాక్టర్ సప్పా భారతి, విద్యావేత్త నడిపల్లి రత్నకుమారి, సామాజిక సేవకురాలు ఎమ్.స్వర్ణలతాదేవి, వ్యాపారావేత్త టి.వరలక్ష్మి, యోగ శిక్షకురాలు శిరీష, హోమ్‌గార్డు ఎస్.ఫణిరత్నశ్రీ, మహిళ, శిశు రచయిత ఎమ్.కృష్ణకుమారి, సంగీత విద్యాంసురాలు మంజులను దుశ్శాలువాలు, బొకేలు ఘనంగా సన్మానించారు.



ప్రతిభ చూపిన మహిళలను సన్మానిస్తున్న చంద్రబాబు

ఘనంగా మహిళా దినోత్సవం

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక వాసవీ విద్యానికేతన్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్, ప్రిన్సిపాల్ కె.రంగయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయినిలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. జార్జ్ ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్పోర్ట్స్ కార్నివాల్ ముగింపు వేడుకలు నిర్వహించారు. జిల్లా డీసీవో జయ మాట్లాడుతూ..మహిళా శక్తి తిరుగులేని శక్తి అన్నారు.

కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఆదిమూలపు సతీష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక జిల్లా వైద్యశాలలో మహిళా దినోత్సవం సందర్భంగా మదర్ థెరిస్సా మహిళా మండలి ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

పెద్దదోర్నాల: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇన్‌చార్జ్ సూపరిండెంటు సంజీవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా మహిళా ఉద్యోగులను టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు షేక్ మంజూర్ భాష శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మెర్సీ, కళాసంధ్య, లావణ్య, ఆంజనేయులు, ఎలిజబెత్, ఆరోగ్యమిత్రలు మణికుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో

పొదిలి : పొదిలి పెన్షనర్ అసోసియేషన్ ఆధ్వర యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పెన్షనర్ అసోసియేషన్ మహిళా కార్యదర్శి దానమ్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మహిళల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెన్షనర్ సంఘ అధ్యక్షుడు ఏ బాదుల్లా, ప్రధాన కార్యదర్శి మదార్‌వలి, వీరారెడ్డి, సుబ్బారావు, మోహన్, డీఎల్ నరసింహారావు, దుర్గావతి, విజయలక్ష్మీ, తదితర నాయకులు పాల్గొన్నారు. అనంతరం పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు.

పొదిలి : మహిళాల విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమౌతుందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రాజ సులోచన అన్నారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా స్థానిక మండలపరిషత్‌కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు విద్యను అభ్యసించడం స్వేచ్ఛ, స్వాతంత్రం, హక్కులను అనుభవించగలుగుతారన్నారు. కార్యక్రమంలో జి దేవకటాక్షమ్మ, పి విజయలక్ష్మీ, జమీలాబేగం, పేరం రాధ, శర్వరి, కిరణ్మయి, వైఎస్‌ఎన్ జ్యోతి, జీ తేజోవతి, జిల్లాయూటీఎఫ్ అధ్యక్షులు అబ్దుల్‌హై, జల్లా కార్యదర్శి పి బాలవెంకటేశ్వర్లు, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలంటే ఇష్టంగా రాయాలి

ఎర్రగొండపాలెం రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్షలు అంటే భయంతో కాకుండా ఇష్టంగా రాయాలని, అప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చునని డీఈవో కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వీరభద్రాపురం గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు పాఠశాల హెచ్‌ఎం మంత్రునాయక్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ రానున్న పది పరీక్షలు బాగా రాసి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకోరావాలన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నతమైన లక్ష్యం ఏర్పాటు చేసుకొని ఆ లక్ష్యం కోసం పనిచేయాలన్నారు. ముందుగా వార్షికోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో శామ్యూల్‌జాన్, ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లునాయక్, మస్తాన్‌నాయక్, ఉపాధ్యాయ సిబ్బంది నాగేశ్వరరావు నాయక్, శ్రీదేవి, లక్ష్మీదేవి, కృష్ణమూర్తి నాయక్, దేవ ప్రసాద్, మంత్రునాయక్, పోతురాజు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రజా మరుగుదొడ్లు ప్రారంభం



మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న సర్పంచ్ రజనీ

కంభం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కందులాపురం కూడలిలో పంచాయతీ నిధులతో నిర్మించిన ప్రజామరుగుదొడ్లను కందులాపురం సర్పంచ్ రజని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కందులాపురం పంచాయతీలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులపై ప్రజలు వస్తుంటారన్నారు. కంభం వచ్చే ప్రజలు, మహిళలు, వృద్ధులు మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ప్రజల సౌకర్యార్థం ప్రజా మరుగుదొడ్లను నిర్మించినట్లు తెలిపారు. శనివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా వీటిని ప్రారంభించారు. కార్యక్రమంలో సూర్యప్రకాశ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు నాణ్యమైన భోజనం

» బీసీ సంక్షేమ శాఖమంత్రి సవిత ఆదేశం
» వసతి గృహం ఆకస్మిక తనిఖీ
» వార్డెన్‌పై అసహనం


హాస్టల్‌లో భోజనాన్ని రుచి చూస్తున్న మంత్రి సవిత

కనిగిరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందజేయాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. పట్టణ సమీపంలోని మాచవరం వద్ద ఉన్న బీసీ గురుకుల బాలికల వసతి గృహాన్ని శనివారం రాత్రి ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా వసతి గృహంలో అందుతున్న సౌకర్యాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. వంటశాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని వార్డెన్‌కు సూచించారు. అనంతరం హాస్టల్ రికార్డులను తీసుకురావాల్సిందిగా వార్డెన్‌ను ఆదేశించగా, ఇంటి వద్ద ఉన్నాయనటంతో మంత్రి సవిత అసహనం వ్యక్తం చేశారు. హాస్టల్ రికార్డులను ఇంటి వద్ద ఎలా పెడతావ్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనం రుచిచూసి కూరలు సరిగా లేకపోవటంపై వార్డెన్‌ను ప్రశ్నించారు. మీ ఇంట్లో ఇలాగే వండుకుని తింటారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద కుటుంబాలకు చెందిన వారి పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు మంచి పౌష్టిక విలువలు కల్గిన ఆహారాన్ని అందించాలనే ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని నీరుగార్చవద్దని హెచ్చరించారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. అమరావతి ప్రాంగణంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, ఎస్. సవిత పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలను ఉద్దేశించి మంత్రి రామనారాయణరెడ్డి మాట్లాడుతూ కనిగిరిలో మహిళాశక్తి పేరుతో జరుగుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. మహిళా సాధికారత కోసం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పదేళ్ల క్రితం తాను ఆర్థిక శాఖా మంత్రిగా ఉన్నప్పుడు డాక్టర్ ఉగ్ర కనిగిరి ఎమ్మెల్యేగా ఉన్నారని గుర్తు చేశారు. ఆసమయంలో కనిగిరి అభివృద్ధి కోసం డాక్టర్ ఉగ్ర చూపించిన చొరవ, కృషి తనకెంతో గొప్పగా అనిపించిందన్నారు. తిరిగి మళ్ళీ తాను ప్రకాశం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా, ఎమ్మెల్యేగా డాక్టర్ ఉగ్ర ఉండటం కాకతాళీయమే అయినప్పటికీ కనిగిరి అభివృద్ధి కోసం తన సహకారం సంపూర్ణంగా ఉంటుందని చెప్పారు. కనిగిరి ఒకప్పుడు నెల్లూరు జిల్లాలో ఉందన్నారు. ఆరకంగా కనిగిరి ప్రాంతంపై తనకు ఎంతో అభిమానం ఉందన్నారు.

మంత్రి సవిత మాట్లాడుతూ కనిగిరి అభివృద్ధి కోసం తన సహకారం ఉంటుందన్నారు. 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో ఎన్నో వసతి గృహాలు నిర్మించిన ఘనత సీఎం చంద్రబాబుదేనని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో కేవలం రెండు మాత్రమే వసతి గృహాలు నిర్మించి ఖజానాలో నిధులు మింగేసి ఊడ్చేశారని మంత్రి ఆరోపించారు. హాస్టల్‌లో బిల్డింగ్ ఏర్పాటు కోసం రూ.50 కోట్లు నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్ళి నిధులు మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తెలుగుమహిళల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మంత్రి సవితను పట్టు వస్త్రాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో తెలుగుమహిళలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అంతకుముందు ఉదయం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర తన నివాసంలో మహిళలను ఘనంగా సన్మానించారు. కేకు కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు ఉజ్వల భవిష్యత్తు, అభివృద్ధికి తగిన సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు సహాయాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు కరణం అరుణ, స్వప్న, దొరసాని, తులసి, పార్వతమ్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


అమరావతి గ్రౌండ్స్‌లో జరిగిన మహిళా దినోత్సవం వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి సవిత, పక్కన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర తదితరులు

ముఖాముఖి

నూరుశాతం ఫలితాల సాధనకు కృషి

డీవీ సుబ్బారావు, ఎంఈవో, పామూరు



ప్రశ్న: పదో తరగతిలో నూరు శాతం ఫలితాల సాధనకు ఎలా చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. జనవరి నుంచి వంద రోజుల కార్యక్రమంలో భాగంగా మోడల్ పరీక్షలు నిర్వహించాం.

ప్ర: సెలవు రోజుల్లో ఎలాంటి కార్యక్రమాలు తీసుకుంటున్నారు?

జ: పాఠశాల సెలవు రోజుల్లో పదో తరగతి విద్యార్థులు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. మధ్యాహ్న భోజనం కూడా అందజేస్తున్నాం.

ప్ర: విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా?

జ: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి విద్యార్థికి అందేలా చర్యలు చేపడుతున్నాం.

ప్ర: పదో తరగతి పరీక్షలకు ఎన్ని సెంటర్లు కేటాయించారు.

జ: మండలంలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు 779 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. మండలంలో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశాం.

స్థానిక సమస్యలపై ఇంటింటి సర్వే

పామూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు ఆపార్టీ నాయకుడు సయ్యద్ హనీఫ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఛత్రపతి శివాజీనగర్, చాకలివీధి తదితర ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇంటింటి సర్వేను శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఈనెల 17 వరకు సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కె.మాల్యాద్రి, షేక్ ఖాదర్‌బాషా, కె.శంకర్, సుభాని, సీహెచ్ వెంకటేశ్వర్లు, బి.నాగేశ్వర్ పాల్గొన్నారు.

సట్టుమడుగులో తాగునీటికి ఇక్కట్లు

పామూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సాగర్ నీరురాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని సట్టుమడుగు గ్రామంలో సాగర్ నీటికోసం వేసిన కుళాయిలు నిరుపయోగంగా మారాయి. చేతి పంపులు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో వాడుక నీటికోసం కూడా ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఘనంగా గ్రామోత్సవం

సీఎస్‌పురం(పామూరు), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లి గ్రామంలో శనివారం స్వామివార్ల విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా తిరుపతి ఇస్కాన్ రూపేష్ ప్రభూజి బృందంతో నగర సంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, ప్రభాకరరావు, నాగబాబు, పిడుగు బాబురావు, ఈవో నరసింహాబాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పంచామృత అభిషేకాలు

పామూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీమదనవేణుగోపాలస్వామి దేవస్థానంలో ప్రతి శనివారం నిర్వహించే పంచామృత అభిషేక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉభయదాత మణిభూషనచారి దంపతులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారిరి నైవేద్యం సమర్పించారు. అర్చకులు సత్యబాబు స్వామివారికి పూజలు నిర్వహించారు.

శంకుస్థాపనకే పరిమితమైన షాదీఖానా

» టీడీపీ హయాంలో మంజూరు
» గత వైసీపీ పాలనలో ముందుకుకదలని వైనం
» కూటమి ప్రభుత్వంపైనే ఆశలు


షాదీఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

దొనకొండ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): దొనకొండ పట్టణంలో షాదీఖానా నిర్మాణం అడుగు ముందుకు పడలేదు. 2014లో టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో షాదీఖానా నిర్మాణాలను తలపెట్టింది. ఈక్రమంలో ఒక్కో షాదీఖానా నిర్మాణానికి 2016లో రూ.15 లక్షలు మంజూరు చేసింది. దొనకొండ మండలానికి మంజూరైన షాదీఖానా నిర్మాణం గురించి ప్రారంభంలో ఎవరూ పట్టించుకోలేదు. అప్పటి మండల కోప్షన్‌సభ్యుడు షేక్ గౌస్ అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో అప్పటి అధికారులు ప్రధాన రహదారి పక్కన షాదీఖానా నిర్మాణానికి ఎకరా యాభై సెంట్లు ప్రభుత్వభూమి కేటాయించారు. దీంతో మైనార్టీ కార్పొరేషన్ నుంచి రూ. 15లక్షల వ్యయంతో షాదీఖానా నిర్మాణం తలపెట్టేందుకు టెండరు ఖరారుచేశారు. అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు మార్చి 1, 2019లో శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ అధికారం చేపట్టింది. టీడీపీ ప్రభుత్వంలో మంజూరైందనే అక్కసుతో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లు దీనిగురించి పట్టించుకోలేదు. దాదాపు ఐదు సంవత్సరాలుగా షాదీఖానా నిర్మాణం పునాది గుంతలకే పరిమితమైందే తప్ప నిర్మాణం పనులు అడుగు ముందుకుపడలేదు.

మండలంలోని దొనకొండ, కొచ్చెర్లకోట, వద్దిపాడు, ఎస్ఎన్‌పాలెం తదితర గ్రామాలలో దాదాపు వెయ్యి వరకు ముస్లిం కుటుంబాలు ఉన్నాయి. వివాహ, ఇతర శుభకార్యాలు, సమావేశాలకు దొనకొండలో సరైన సౌకర్యంలేక ఇబ్బందులు పడుతున్నారు. నాడు టీడీపీ ప్రభుత్వంలో మంజూరైన షాదీఖానాను ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

షాదీఖానా నిర్మాణం టీడీపీతోనే సాధ్యం


- షేక్ తోహీద్, దొనకొండ పట్టణ అధ్యక్షుడు



దొనకొండ మండలంలోని ముస్లిం కుటుంబాలకు షాదీఖానా అవసరమని అప్పట్లో టీడీపీ ప్రభుత్వం గుర్తించి షాదీ ఖానా మంజూరుచేసింది. అనంతరం అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమనిధిని విస్మరించి షాదీఖానా నిర్మాణం గురించి పట్టించుకో లేదు. ముస్లిం మైనార్టీల పట్ల వైసీపీ ప్రభుత్వం అవలంభించిన తీరుకు నిదర్శనంగా షాదీఖానా శిలాఫలకం, పునాదులు అందుకు దర్పణం పడుతున్నాయి. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వంలో షాదీఖానా నిర్మాణం జరిగేలా చర్యలు చేపడతాం.

సాగర్ కాలువల్లో పెరిగిన తూటుకాడ

» నీటి సరఫరాకు ఆటంకం
» ఇబ్బందులు పడుతున్నరైతులు


దర్శి బ్రాంచ్ కాలువలో నీటి సరఫరాకు అడ్డంకిగా మారిన తూటుకాడ

దర్శి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువల్లో తూటుకాడ పెరిగి నీటి సరఫరాకు అడ్డంకిగా మారింది. దర్శి బ్రాంచ్ కాలువలో అధికంగా పెరగటంతో దిగువన ఉన్న ఒంగోలు బ్రాంచ్ కాలువలకు నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోయింది. ప్రస్తుతం ఒంగోలు బ్రాంచ్ కాలువకు కేవలం 400 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదలవుతుంది. సుమారు 1.70 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్న ఒంగోలు బ్రాంచ్ కాలువకు అతితక్కువగా నీరు విడుదలవుతుంది. దీంతో చివరి ఆయకట్టు భూములకు అసలు నీరు అందక సాగు చేసిన పైర్లు ఎండిపోతున్నాయి. ఒంగోలు బ్రాంచ్ కాలువకు కనీసం 700 క్యూసెక్కులకు తగ్గకుండా నీరు విడుదల చేస్తేనే అన్నీ మేజర్లు, మైనర్లకు నీరందుతుంది. ప్రస్తుతం అతితక్కువగా నీరు విడుదలవుతున్నందున అనేక మేజర్లకు నీరు చేరడం లేదు. ఎన్ఎస్‌పీ అధికారులు ఈ సమస్యను గుర్తించి తూటుకాడ తొలగించి చివరి భూములకు సక్రమంగా నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.


లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయాధికారి భరత్‌చంద్ర

రాజీమార్గంతో ప్రశాంతమైన జీవనం గడపాలి

కనిగిరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజీ మార్గం ద్వారా ప్రశాంతమైన జీవనం గడపాలని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కె.భరత్‌చంద్ర అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆయన మాట్లాడారు. అనివార్య కారణలవల్ల తలెత్తిన వివాదాలతో కక్షలు పెంచుకుని కేసులు నమోదు చేసుకుని కోర్టులను ఆశ్రయిస్తున్నారన్నారు. కోర్టులను ఆశ్రయించి విలువైన సమయాన్ని, నగదును కోల్పోకుండా లోక్ అదాలత్‌లో రాజీ మార్గమే రాజమార్గమన్నారు. ప్రతిఒక్కరూ మహిళలను గౌరవించాలని కోరారు. వారికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. మహిళా చట్టాలపై విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉందని పోలీసులకు సూచించారు. న్యాయసేవాధికార సంస్థల ద్వారా మహిళలకు ఉచిత న్యాయ సహాయం అందించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, మున్సిపల్ చైర్మన్ గఫార్, న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు. కాగా, శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 227 కేసులు పరిష్కారమయ్యాయి. వాటిలో 72 క్రిమినల్ కేసులు, 4 భరణం కేసులు, 151 ఎస్‌టీసీ కేసులు ఉన్నాయి. ఇరువర్గాల వారికి రాజీ కుదిర్చి పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం


వ్యాధితో బాధపడుతున్న వారిగురించి చంద్రబాబుకు వివరిస్తున్న డాక్టర్ లక్ష్మి

తాళ్లూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరంగ్రామానికి చెందిన కొడిమెల వెంకట్రావు కుమారులు ఆదిత్యకుమార్, రవి ప్రకాశ్‌లు వెన్నెముక కండరాల క్షీణత వ్యాధితో బాధపడుతున్నారు. వ్యాధి నయం చేయించే స్థితిలేక శనివారం మార్కాపురం వచ్చిన సీఎం చంద్రబాబును కలిసేందుకు వెళ్లారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వారిని సీఎం చంద్రబాబు వద్దకు తీసుకెళ్లి పరిస్థితిని వివరించారు. తమకు న్యాయం చేస్తామని సీఎం తెలిపినట్టు వెంకట్రావు తెలిపారు. చంద్రబాబును కలిశాక మాపిల్లలను బతికిస్తాడన్న నమ్మకం కలిగిందన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

కనిగిరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టాలని ఐద్వా సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక సుగుణావతమ్మ సెంటరు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నేతలు మాట్లాడుతూ మహిళలపై దాడులను పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా రక్షణ చట్టాలను సమర్థవంతంగా అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఎస్కే బషీరా, ప్రసన్న, శాంతకుమారి, వెంకటమ్మ, సీఐటీయూ నాయకులు నరేంద్ర, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనాయక్

దొనకొండ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): విద్యతోనే మెరుగైన భవిష్యత్తు సాధ్యమని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.లక్ష్మీనాయక్ పేర్కొన్నారు. ఈక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. స్థానిక ఎస్సీ బాలుర 1, 2 వసతి గృహాల పదో తరగతి విద్యార్థులకు సంక్షేమాధికారి ఎం.మంత్రూనాయక్ ఆధ్వర్యంలో శనివారం ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనాయక్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశలను, ఆకాంక్షలను నెరవేర్చేలా ఉత్తమ ఫలితాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పీసీపల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఆదివారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ లక్ష్మీరాజేష్ తెలిపారు. పెదఅలవలపాడు, పీసీపల్లి సబ్‌స్టేషన్‌లలో మరమ్మతు పనుల దృష్ట్యా ఉదయం 6 నుంచి 9 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ఈ రెండు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం

» ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు

తాళ్లూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళల పాత్ర కీలకమని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఎంఎంఎస్ అధ్యక్షురాలు ఎం.సుజాత అధ్యక్షతన జరిగాయి. ఎంపీపీ మాట్లాడుతూ మహిళలకు అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం చేయూతనిస్తుందని చెప్పారు. జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి మాట్లాడుతూ కుటుం ఉన్నతిలో మహిళల కృషి వెలకట్టలేనిదన్నారు. ఎంఈవో జి.సుబ్బయ్య మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. ఈసందర్భంగా పొదుపు మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా మాధవరం వీవో అధ్యక్షురాలు గోరంట్ల అంజమ్మను ప్రత్యేకంగా సత్కరించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎం.సుజాత, మాజీ అధ్యక్షురాలు జి.భాగ్యలక్ష్మి, అకౌంటెంట్ కుమారి, స్వీపర్ అంజమ్మలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, శివనాగిరెడ్డి, శాగం కొండారెడ్డి, ఐ.శ్రీనివాసరెడ్డి, రాచకొండ వెంకట్రావు, జి.లక్ష్మీనారాయణ, ఏపీఎం పి.దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.


దర్శిలో సత్కారం పొందుతున్న మహిళా డాక్టర్లు

దర్శిలో.. దర్శి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సుమన్ అధ్యక్షతన మహిళా డాక్టర్లను సన్మానించారు. అక్కడ పనిచేస్తున్న డాక్టర్ గీతాపద్మ, డాక్టర్ లక్ష్మీపూజిత, డాక్టర్ లక్ష్మీలను మానవతా సేవా సంస్థ కన్వీనర్ కె.శ్రీనివాసరెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు. అలాగే, మండలంలోని రాజంపల్లిలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాజంపల్లి పంచాయతీని మహిళా స్నేహ పూర్వక పంచాయతీగా ఎంపిక చేశారు. దీంతో జిల్లా పరిషత్ అధికారి అమర్, ఎంపీడీవో ఎల్.కృష్ణమూర్తి తదితరులు రాజంపల్లి సర్పంచ్ అన్నపూర్ణమ్మతో పాటు పలువురు మహిళా అధికారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఆవుల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కురిచేడులో.. కురిచేడు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ కురిచేడు మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా 30 మంది ఉపాధ్యాయినులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వల్లెం స్వాతి, దార్ల అశ్విని, బాలా నాయక్, ఖాజా రహంతుల్లా, సీహెచ్ శివరామక్రిష్ణ, పచ్చా పూర్ణచంద్రరావు, గోలి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


కనిగిరి: డాక్టర్ ఆదిలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న మానవతా సంస్థ, విజేత విద్యాసంస్థల చైర్మన్, కాపు నేతలు

దొనకొండలో.. దొనకొండ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమీ డిగ్రీ కాలేజీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను అడ్మిన్ ఎఫ్రాయిమ్(నాని) నేతృత్వంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామయోగి, అధ్యాపకులు వెంకటేశ్వరరెడ్డి, దేవదానం, విక్టోరియా, తదితరులు పాల్గొన్నారు.

పామూరులో.. పామూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మగవారితో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు తమ హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని జేవీవీ మండల కార్యదర్శి కె.శంకర్ అన్నారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం చెందుతున్నాయన్నారు. ఎన్ని చట్టాలు తెచ్చిన దాడులు ఆగడం లేదన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు షేక్ మదారమ్మ, సయ్యద్ రమీజ, కె.ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


కనిగిరిలో.. కనిగిరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీదేవి నర్సింగ్‌హోంలో ప్రముఖ వైద్యురాలు టి.ఆదిలక్ష్మి, డాక్టర్ ఆర్.రామయ్యనాయుడును విజేత విద్యాసంస్థల చైర్మన్ అరుణోదర్, మానవతాసంస్థ నాయకులు గుత్తి శ్రీధర్‌లు సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ ఆదిలక్ష్మి వైద్యరంగంలో తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. కార్యక్రమంలో కాపుసంఘం నేతలు ముండ్లమూరి మాలకొండయ్య, నామా పుల్లయ్య, బొట్టు శ్రీను, వీరయ్య పాల్గొన్నారు. ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఎన్.శ్రీలత అధ్యక్షతన సంఘ కార్యాలయంలో డాక్టర్ అనూరాధ, మహిళా ఉపాధ్యాయ, ఉద్యోగులను సన్మానించారు. ఐకిడ్స్ స్కూల్‌లో మహిళా ఉపాధ్యాయినిలను సత్కరించారు. సాయి దివ్యాంగుల సేవా కేంద్రంలోనూ మహిళలను సన్మానించారు.





నరసరావుపేట మున్సిపాల్టీ నీటి శుద్ధి ప్లాంట్

ముంపు మళ్లింపు



కొండవీటివాగు వరద జలాలను ఎగువ, దిగువ ప్రాంతాలకు మళ్లించే పథకం ప్లాను

- రాజధానిలో వరద నివారణ చర్యలు
- రూ.3 వేల కోట్లతో రెండు దశల్లో పనులు
- ప్రత్యర్థి పార్టీ నేతల కుట్రలతో పటిష్ఠ చర్యలు
- తొలిదశలో కొండవీటివాగు, పాలవాగు అభివృద్ధి
- వరద నివారణతో ఆకర్షణీయంగా అమరావతి నగరం

రాజధాని అమరావతికి అతిపెద్ద సవాల్‌గా వరద ముంపును చిత్రీకరించారు. గత వైసీపీ ప్రభుత్వం రాజధాని అమరావతి నిర్మాణాన్ని సంక్లిష్టంగా మార్చేసింది. అమరావతికి లేని ముంపు సమస్యను భూతద్ధంలో రుణదాతలకు చూపుతూ ప్రత్యర్థి పార్టీ నాయకులు కొందరు అడ్డంకులు సృష్టిస్తూనే ఉన్నారు. వాటిని అధిగమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు తనదైన దృఢచిత్తంతో రాజధాని నిర్మాణ పనులను ముందుకే తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో వరద ముంపు సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు సుమారు రూ.3 వేల కోట్లకు పైగా వ్యయంతో రెండు దశల్లో పనులను చేపడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు హయాంలో ముంపు నివారణకు చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా తీసుకుంటున్న చర్యలతో అమరావతికి వరదముంపు నుంచి శాశ్వత రక్షణ లభించినట్లే. ప్రత్యర్థి పార్టీ కుట్రపూరిత ఆలోచనల ఫలితంగా.. అనివార్యంగా చేపట్టాల్సి వస్తున్న వరదముంపు నివారణ పనులతో అమరావతి నగరం మరింత సుందరంగా ఆకర్షణీయంగా రూపుదిద్దుకోబోతుంది.

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

రాజధాని అమరావతికి కృష్ణానది వరదలతో ఎటువంటి ముప్పులేదు. గత వందేళ్ల చరిత్ర చూసినా ఇది తేటతెల్లమవుతోంది. ఎగువన నదికి ఇరువైపులా కరకట్టలు ఉన్నాయి. గత టీడీపీ పాలనలో కొండవీటివాగు వరదపై అవగాహన తో అప్పటి సీఎంగా చంద్రబాబు 2018లోనే ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అమరావతిని ఉక్కుపాదంతో తొక్కేసింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వ హయాంలో చంద్రబాబు అమరావతిపై ప్రత్యేక దృష్టి సారించారు. అయితే ప్రతిపక్ష పార్టీల పెద్దలు అమరావతికి వరదముంపు ఉందని రుణాలను ఇచ్చే సంస్థలకు పదేపదే ఫిర్యాదులను పంపుతున్నారు. ఆయా ఫిర్యాదుల నేపథ్యంలో ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ఇస్తున్న సలహాలు, సూచనలతో కూటమి ప్రభుత్వం అమరావతిలో మరిన్ని వరద ముంపు నివారణ చర్యలను అనివార్యంగా మరింత పటిష్ఠవంతంగా చేపట్టాల్సి వచ్చింది. దీంతో కొండవీటివాగు, పాలవాగుతో పాటు గ్రావిటీ కెనాళ్ల కాల్వలను బ్రహ్మాండంగా వినియోగించుకోబోతున్నారు. దీంతో రాబోయే రోజుల్లో ప్రళయం ముంచుకొచ్చినా అమరావతికి ఎలాంటి ఢోకా ఉండబోదు.. సరికదా పర్యాటకంగా ఇవన్నీ అందర్నీ ఆకట్టుకుని ప్రభుత్వానికి ఆర్థికంగా లాభదాయకంగా మారనున్నాయి. సుందరమైన జలాశయాలు, గ్రావిటీ కెనాల్స్ నిర్మాణ పనులతో నగరమంతా బ్లూగ్రీన్ సిటీగా మారబోతుంది.

రెండు భాగాలుగా విభజన.. రెండు దశల్లో పనులు

అమరావతి నగరాన్ని కొండవీటి వాగు ఎగువ పరీవాహక ప్రాంతం, దిగువ పరీవాహకప్రాంతమనే రెండు భాగాలుగా విభజించి రెండు దశలుగా వరద ముంపు నివారణ చర్యలను చేపట్టనున్నారు. రెండు దశల పనులను సమగ్రంగా చేపడితే ప్రపంచంలోనే అమరావతి అత్యంత సురక్షిత ప్రదేశంగా నిలిచిపోతుంది. పైగా ఆరు రిజర్వాయర్‌ల ఏర్పాటుతో నగర ప్రజల తాగునీటి అవసరాలు కూడా పుష్కలంగా తీరుతాయి. ముంపు నివారణ చర్యలను ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు అందజేస్తున్న రుణం నుంచి చేపడుతున్నారు. ఈ మొత్తం వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యంత్రాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ యంత్రాంగం విప త్తుల నిర్వహణ సంస్థతో సమ న్వయం చేసుకుంటూ వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రిజర్వాయర్లలో హెచ్చుతగ్గులను నియంత్రిస్తూ ఎత్తిపోతల పథకాలను అవసరాన్ని బట్టి వినియో గిస్తుంటాయి. తద్వారా రాజధాని అమరావతిలో వరదలు తలెత్త కుండా చర్యలు తీసుకుంటారు.

* మొదటి దశలో కొండవీటివాగు దిగువ పరీవాహక ప్రాంతంలో నివారణ పథకం పనులను చేపట్టను న్నారు. ఈ పథకం తొలినుంచి అనుకుందే అయినా తాజాగా దీనిని మరింత విస్తృతస్థాయిలో చేపట్టనున్నారు. తొలిదశ పనుల కింద చేపట్టేందుకు అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీఎల్) గత జనవరిలో టెండర్లను ఆహ్వానించింది. కొండవీటివాగు, పాలవాగు విస్తరణ, శాఖమూరు రిజర్వాయర్ నిర్మాణానికి రూ.462.26 కోట్ల వ్యయంగా అంచనా వేస్తూ ఒక టెండర్‌ను పిలిచారు. గ్రావిటీ కెనాల్, కృష్ణాయపాలెం రిజర్వాయర్ నిర్మాణానికి రూ.303.73 కోట్ల వ్యయంగా అంచనా వేస్తూ మరో టెండర్‌ను ఆహ్వానించారు. నీరుకొండ రిజర్వాయర్ నిమిత్తం రూ.470.75 కోట్ల అంచనాతో మరో టెండర్‌ను పిలిచారు. ఉండవల్లి వద్ద ప్రస్తుతం ఉన్న ఎత్తిపోతల పథకం పక్కనే కొత్తగా 7360 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసేందుకు మరో ఎత్తిపోతలను కూడా నిర్మించాలని ప్రపంచబ్యాంకు చేసిన సూచనను కూడా పరిగణనలోకి తీసుకుని డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నారు. దీనికి సుమారు రూ.300 కోట్లకు పైగా ఖర్చయ్యే అవకాశం ఉంది.

* శాఖమూరులో 50 ఎకరాల విస్తీర్ణంలో 0.03 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా, నీరుకొండలో 440 ఎకరాల్లో 0.43 టీఎంసీల నీటిని నిల్వచేసేలా, కృష్ణాయపాలెంలో 190 ఎకరాల్లో 0.09 టీఎంసీల నీటిని నిల్వచేసేలా చెరువులను నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు.

* అనంతవరం నుంచి వయా శాఖమూరు, నీరుకొండ, కృష్ణాయపాలెం రిజర్వాయర్ల మీదగా ఉండవల్లి వరకు 23.6 కిలోమీటర్ల పొడవున్న కొండవీటివాగును, బోరుపాలెం నుంచి కొండమరాజుపాలెం మీదగా కృష్ణాయపాలెం రిజర్వాయర్ వరకు ఉన్న పాలవాగును లోతు చేసి విస్తరించనున్నారు.

* కొత్తగా నెక్కల్లు నుంచి తుళ్లూరు, అనంతవరం, పిచ్చుకలపాలెం వరకు ఎనిమిది కిలోమీటర్ల పొడవునా గ్రావిటీ కెనాల్‌ను ఏర్పాటుచేయనున్నారు.

* రెండోదశలో కొండవీడు కొండల నుంచి వచ్చే వరద నీటిలో కొంత భాగాన్ని లాం వద్ద నుంచి పెదపరిమి మీదగా వైకుంఠపురం వైపు దారిమళ్లించనున్నారు. ఇందుకోసం లాం, పెదపరిమి, వైకుంఠపురంల వద్ద మూడు వేర్వేరు రిజర్వాయర్లను నిర్మించనున్నారు. వీటిని అనుసంధానిస్తూ గ్రావిటీ కెనాల్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. అవసరమైతే ఈ కెనాల్‌పై మినీ ఎత్తిపోతల పథకాలను మూడింటిని ఏర్పాటుచేసేలా డిజైన్ చేస్తున్నారు.

* చివరగా వైకుంఠపురం రిజర్వాయర్ నుంచి కృష్ణానదిలోకి మిగులు వరద జలాలను ఎత్తిపోసేందుకు 5650 క్యూసెక్కుల సామర్థ్యంతో భారీ ఎత్తిపోతలను ఏర్పాటు చేయనున్నారు.



కొండవీటివాగు మొత్తం పరివాహక ప్రాంతం

వేసవి కార్యచరణకు.. రూ.9.29 కోట్లు

- ప్రభుత్వానికి మున్సిపాల్టీల ప్రతిపాదనలు
- ట్యాంకర్ల ద్వారా పట్టణాల్లో నీటి సరఫరాకు ఏర్పాట్లు
- ప్రభుత్వం నుంచి నిధుల కోసం పురపాలకుల ఎదురుచూపు
- పల్నాడు జిల్లాలో పలు మున్సిపాల్టీల్లో రెండు రోజులకు ఒకసారే తాగునీరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)


ఎండలు మండుతున్నాయి.. పట్టణ ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. మున్సిపల్ కేంద్రాల్లో తాగు నీటి సరఫరా కష్టంగా మారి ప్రజలు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. పట్టణాల్లో నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించేందుకు వేసవి కార్యచరణతో మున్సిపాలిటీలు సిద్ధమయ్యాయి. తాగునీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి అవసరమైన పురపాలకులు ప్రణాళికలు రూపొందించారు. గతంలో నీటి ఎద్దడి నెలకొన్న ప్రాంతాలను గుర్తించారు. ఆ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీటి పథకాల మరమ్మతులకు సిద్ధమయ్యారు. వేసవి ప్రణాళిక అమలుకు రూ.9.29 కోట్లు అవసరమని మున్సిపాల్టీలు ప్రభుత్వానికి ప్రతిపాదలను పంపాయి. అయితే ఈ ప్రతిపాదనలపై ప్రభుత్వం ఇంకా స్పందించలేదని అధికారులు చెబుతున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపాల్టీల్లో ప్రస్తుత నీటి సరఫరా, వేసవి లో తలెత్తే సమస్యలను అధికారులు గుర్తిం చారు. వేసవిలో వినుకొండ, చిలకలూరిపేట, మాచర్ల, గురజాల పట్టణాలు ఏటా తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుతం ఆయా పట్టణాల్లో పూర్తిస్థాయిలో నీటి సర ఫరా జరగడంలేదు. ఈ పట్టణాల్లో రెండు రోజులకు ఒక సారి నీటి సరఫరా చేస్తున్నారు. మూడు జిల్లాల్లో ఒక్క నరసరావు పేటలో మాత్రమే రోజూ రెండు పూటల పుష్కలంగా నీటి సరఫరా జరుగుతోంది. మంగళగిరి, తాడేపల్లి, అద్దంకి, చీరాల, బాపట్ల రేపల్లె మున్సిపాల్టీల్లో రోజూ నీటి సరఫరా జరుగుతోంది. గుంటూరు, తెనాలి, పొన్నూరు, సత్తెనపల్లి మున్సిపాల్టీల్లో రోజూ ఒక పూట నీటి సరఫరా చేస్తున్నారు. గురజాల మున్సిపాల్టీలో 69 రోజులకు, చిలకలూరిపేటలో 79 రోజులు, వినుకొండలో 67 రోజులకు సరిపడా నీటి నిల్వలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఇప్పటి నుంచే నీటి ఎద్దడి నివారణకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, పైపులైన్లు తదితర మరమ్మతుల కోసం ప్రతిపాదించారు. ప్రభుత్వం నుంచి నిధుల విడుదల కోసం పురపాలకులు ఎదురుచూస్తున్నారు. చిలకలూరిపేట మున్సిపాల్టీలో రూ.1.15 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించగా అందులో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు రూ.30 లక్షలు అవసరమని పేర్కొన్నారు.

ప్రతిపాదనలు ఇలా..

మున్సిపాల్టీ	నిధులు
పల్నాడు జిల్లా	
నరసరావుపేట	రూ.1.62 కోట్లు
చిలకలూరిపేట	రూ.1.15 కోట్లు
వినుకొండ	రూ.70 లక్షలు
మాచర్ల	రూ.1.19 కోట్లు
గురజాల	రూ.30 లక్షలు
దాచేపల్లి	రూ.40 లక్షలు
పిడుగురాళ్ల	రూ.30 లక్షలు
సత్తెనపల్లి	రూ.15 లక్షలు
గుంటూరు జిల్లా	
పొన్నూరు	రూ.44 లక్షలు
తెనాలి	రూ.52.50 లక్షలు
మంగళగిరి-తాడేపల్లి	రూ.80 లక్షలు
బాపట్ల జిల్లా	
బాపట్ల	రూ.25 లక్షలు
అద్దంకి	రూ.21.50 లక్షలు
చీరాల	రూ.37 లక్షలు
రేపల్లె	రూ.88 లక్షలు

ముందస్తుగా మేల్కోవాలి..

ఈ ఏడాది నాగార్జునసాగర్ జలాశయంలో నీటి నిల్వలు నిండుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పురపాలకులు ముందస్తుగా మేల్కోవాలి. ఈ నెలాఖరు వరకు కాల్వల కు నీటి సరఫరా జరగనుంది. దీంతో మున్సిపాల్టీల చెరువులను పూర్తిస్థాయిలో నింపేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టకుంటే పట్టణ ప్రజలగొంతెండటం ఖాయం.



- కల్తీకారం తయారీకి సిద్ధంగా ఉన్న నాసిరకం మిర్చి

- కొండల మాటున యథేచ్ఛగా తయారీ
- ఇరవై రోజుల క్రితమే స్థానికుల ఫిర్యాదు
- కన్నెత్తి చూడని అధికారులు..
- టన్నుల కొద్దీ తరలింపు

పేరేచర్లలో కల్తీకారం కర్మాగారం

మేడికొండూరు మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు కారం అంటే ఓ బ్రాండ్. దీనిని అవకాశంగా తీసుకున్న కొందరు నాసిరకం కారం తయారీ చేసి ప్రజల ప్రాణాలను హరిస్తున్నారు. మిరపకాయల తొడిమలు, రంగు మారిన కాయలు, వాటి విత్తనాలతో పొడిని తయారుచేసి దానికి రంగు, రసాయనాలు కలిపి నాణ్యమైన కారాన్ని తలదన్నేలా కల్తీకారాన్ని తయారు చేసి టన్నుల కొద్దీ తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కడో మారుమూల ప్రాంతంలో కల్తీ కారం తయారవుతుంది.. అధికారులు తెలుసుకోలేరు అనుకుంటే పప్పులో కాలేసినట్లే. గుంటూరు నగరానికి సమీపంలో మేడికొండూరు మండలం పేరేచర్ల కొండ ప్రాంతంలోనే కల్తీకారం కర్మాగారం ఏర్పాటు చేశారు. గుంటూరులోని కొన్ని పరిశ్రమల్లో మిర్చి కాయల నుంచి వేరు చేసిన తొడిమలను సేకరించి ఇక్కడకు చేరుస్తున్నారు. రాత్రి వేళల్లో భారీ యంత్రాలను ఉపయోగించి పనికిరాని కాయలను, తొడిమలను యంత్రాల్లో వేసి పొడిగా తయారు చేస్తున్నారు. ఆ పొడికి రసాయనాలు, వెల్లుల్లి వేస్ట్, సన్‌ఫ్లవర్ ఆయిల్ వంటివి కలిపి స్వచ్ఛమైన కారంగా, చూడటానికి ఎంతో నాణ్యంగా కనిపించేలా తయారు చేస్తున్నారు. గన్నీ బ్యాగులలో ఈ కారాన్ని గుంటూరులోని గోడౌన్లకు తరలించి అక్కడ కేజీ నుంచి వంద గ్రాములు ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. కొన్ని కంపెనీల బ్రాండ్ల పేరుతో కూడా ఈ కారాన్ని ప్యాక్ చేసి మరీ అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ కల్తీ కారం గుంటూరు సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు తెలంగాణకు తరలిస్తున్నారు. తక్కువ ధరకు వస్తుండటంతో ఆయా ప్రాంతాల్లోని హోటళ్లు, కర్రీ పాయింట్లలో వినియోగంతో పాటు చిల్లర దుకాణాల్లోనూ విక్రయిస్తున్నారు. కల్తీకారం ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నా సంబంధిత కల్తీ నిరోధక శాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

నాసిరకం విత్తనాలు...

ఇక్కడ కల్తీ కారంతో పాటు నాసిరకం విత్తనాలు కూడా తీస్తున్నారు. కొన్ని రకాల మిర్చి కాయలను ఎంపిక చేసుకుని యంత్రాల ద్వారా విత్తనాలను తీస్తున్నారు. ఈ విత్తనాలకు కొంత మంచి విత్తనాలను కలిపి రైతులకు విక్రయిస్తారని సమాచారం. విత్తనాలు తీయగా మిగిలిన కాయలను, తొడిమలను పొడిగా చేసి కారం తయారీకి వినియోగిస్తున్నారు.

కళ్ల మంటలతో అల్లాడుతున్న ప్రజలు

మిర్చి తొడిమలను పొడిగా చేయాలంటే విపరీతంగా కోరు వస్తుంది. దీంతో కొండల మధ్య జనసంచారం లేని ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని కర్మాగారం ఏర్పాటు చేశారు. కొండల ప్రాంతంలో జనసంచారం లేని ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని ఏపుగా పెరిగిన చెట్ల మధ్య భారీ యంత్రాలను ఏర్పాటు చేసి కారం తయారు చేస్తున్నారు. సాయంత్రం 6 గంటలకు మొదలుపెట్టి ఉదయం 6లోపు ముగిస్తున్నారు. అప్పటి వరకు తయారు చేసిన కల్తీకారాన్ని మినీ లారీలలో లోడ్ చేసి గుంటూరులోని గోడౌన్లకు తరలిస్తున్నారు. తెల్లవారగానే జనరేటర్లు, యంత్రాలపై పట్టాలు కప్పి ఏమీ తెలియనట్లు వెళ్లిపోతున్నారు. ఆరు గంటల తర్వాత పేరేచర్ల గ్రామ ప్రజలకు కళ్లు మంటలు వస్తున్నాయి. తొలుత ఈ కళ్లమంటలకు కారణం తెలియక అయోమయంలో పడ్డారు. ఇటీవల కొందరు గ్రామస్తులు కొండల ప్రాంతంలో పరిశీలించగా మిర్చి బస్తాలు, తొడిమలు, పట్టాలు కప్పి ఉన్న యంత్రాలను గుర్తించారు. ఇరవై రోజుల క్రితం దీనిపై మేడికొండూ రు పోలీసులతో పాటు పంచాయతీ కార్యాలయం లో నూ ఫిర్యాదు చేశారు. అయితే ఇప్పటి వరకు ఆయా అధికారులు స్పందించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.22 (ఆదివారం)

సహరి : 5.04 (సోమవారం)

చంద్రబాబుతోనే మహిళల అభ్యున్నతి

- టీడీపీ హయాంలో ఆడబిడ్డలకు ఆర్థిక స్వాతంత్ర్యం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి
- రేపల్లెలో వేడుకగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

రేపల్లె, బాపట్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. రేపల్లెలోని ఎంసీఏ హాల్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లా డుతూ పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారన్నారు. మహిళల మేలు కోసం అప్పట్లో ఎన్టీఆర్ సమానహక్కులు కల్పిస్తే, స్త్రీలకు ఆర్థికస్వాతంత్ర్యం కల్పించడంలో చంద్రబాబు ఏళ్ల కృషి ఉందన్నారు. డ్వాక్రా సంఘాలకు పురుడుపోసి నేడు వారు లక్షల రూపాయల రుణాలు పొందేలా చేశారన్నారు. మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం సాధించడంలో ఆ సంఘాలే కీలకంగా పని చేస్తున్నాయన్నారు. ఇంటికో వ్యాపారవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు పనిచే స్తున్నారని, వీరిలో మహిళలే ఎక్కువగా ఉండాలన్నది ఆయన ఆకాంక్ష అని తెలిపారు. ఒక్క మహిళా దినోత్సవం రోజునే కాకుండా మహిళలను నిత్యం గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరిదన్నారు. రెవెన్యూ మంత్రి అనగాని మాట్లాడుతూ మహిళలు చేసిన కృషి, త్యాగాల వల్లే నేడు మనందరం ఈ స్థాయిలో ఉన్నామ న్నారు. మహిళలు వంటింటికే పరిమి తమనే ఆలోచనలో ఉన్న సమా జం ఉంటే, అవకాశాలు కల్పిస్తే వారు అన్ని రంగాల్లో సత్తాచాటగలరని నిరూపించిన దార్శనికుడు చంద్రబాబుని కొనియాడారు. అటు కుటుంబ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహి స్తూనే ఇటు వివిధ రంగాలలో రాణించడం మహిళలకే సాధ్యమ న్నారు. స్త్రీలేనిదే జననం లేదు, గమనం లేదని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్ర సాద్ తెలిపారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంద న్నారు. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికలను, అమలు చేస్తున్న పథకాలను కలెక్టర్ వెంకటమురళి వివరించారు. అం తర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 592 స్వయం సహాయక సంఘాలకు, పీఎంఈజీపీ లబ్ధిదారులకు, 169 మెప్మా సంఘాలకు మంత్రులు చెక్కులను అందజేశారు. వివిధ రంగాలలో ప్రతిభ చూపిన 33 మంది మహిళలను సత్కరించారు. ఎస్పీ కార్యాలయంలోని ఐటీ కోర్ కానిస్టేబుల్ కీర్తివర్మ చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, లిడ్‌క్యాప్ చైర్మన్ మాణిక్యాల రావు, ఎస్పీ తుషార్ డూడీ, జేసీ ప్రఖర్‌జైన్, రేపల్లె ఆర్డీవో ఎస్.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



స్టాల్స్‌ను సందర్శిస్తున్న మంత్రులు పార్థసారథి, అనగాని



స్వయం సహాయక సంఘాలకు చెక్కును అందిస్తున్న మంత్రులు పార్థసారథి, అనగాని, కలెక్టర్ వెంకటమురళి

ఉత్సాహంగా మహిళా దినోత్సవం

- మహిళాభివృద్ధికి పెద్దపీట
- ఎమ్మెల్యే కొండయ్య
- మెప్మా సంఘాలకు రూ.3.80కోట్ల చెక్కుల పంపిణీ



చిన్నారులతో కలిసి సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య



సెయింట్ ఆన్స్ వేడుకల్లో మాట్లాడుతున్న న్యాయాధికారి సుధ

చీరాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళల అభిద్ధికి కూటమి పెద్దపీట వేస్తుందని, ప్రస్తుతం దేశంలోనే వారు అత్యున్నత స్థానాల్లో ఉండి విజయాలు సాధిస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నా రు. శనివారం పట్టణంలో మహిళా దినోత్సవ కార్యక్రమాలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరిగాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఫ్రైడ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా పట్టణంలోని ఐఎంఏ హాలు నుంచి ముక్కోణం పార్క్ వరకు చిన్నారులతో కలిసి సైకిల్ ర్యాలీలో కొండయ్య పాల్గొని అందరినీ ఉత్సాహ పరిచారు. గడియార స్తంభం కూడలిలో చిన్నారుల నృత్య ప్రదర్శన అందరినీ అలరించింది. అనంతరం మెప్మా సీఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సతీమణి బాలకొండమ్మతో హాజరయ్యారు. మహిళల రక్షణకు ప్రభుత్వం శక్తి యాప్ ప్రారంభించినట్లు వివరించారు. ఈ సందర్భంగా 126 పొదుపు సంఘాల గ్రూపులకు రూ.3.80 కోట్ల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో హ్యాండ్‌లూమ్ ఛైర్మన్ సజ్జా హేమలత, మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ కళాశాల ఆధ్వర్యంలో

మహిళలు లింగ వివక్షను వీడి విద్య, వ్యాపార రంగాల్లో రాణించాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.సుధ, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్‌కే రిహానా, డా. కే అనిత అన్నారు. సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తులు హాజరై ఉపన్యసించారు. కార్యక్రమంలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ డా.జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా మండలిలో

మహిళ మండలిలో మాజీ మంత్రి జాగర్లమూడి లక్ష్మీపద్మావతి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. అలాగే జనసేన పార్టీ వీర మహిళల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, ఈపూరుపాలెంలో జరిగిన వేడుకల్లో ట్రైనీ డీఎస్పీ అభిషేక్, ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు. వాడరేవులో సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.సుభాషిణి పాల్గొన్నారు.

పంగులూరు : మహిళలు ఉన్నతంగా ఎదిగేందుకు ప్రభుత్వం సహకారంతో పాటు సమాజం తగిన తోడ్పాటు అందించాలని అద్దంకి రూరల్ సీఐ డి.మల్లికార్జునరావు అన్నారు. ముప్పవరంలోని వసతి గృహ బాలికలతో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ. వినోద్‌బాబు, వార్డెన్ పద్మావతి, వసతి గృహ బాలికలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు స్వయం శక్తితో అన్ని రంగాలలో ఉన్నతంగా ఎదగడం ద్వారానే సమాజం ప్రగతి పథంలో ముందడుగు వేస్తుందని వెలుగు ఏపీఎం జ్యోతి ప్రసాద్ అన్నారు. మహిళలకు పలు పోటీలను నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. వెలుగు కార్యాలయ సిబ్బంది శకిలమ్మ, ఎకౌంటెంట్ భాస్కరమ్మను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు గొట్టిపాటి వెంకటరత్నం, సీసీలు సాల్మన్, సురేష్, చంద్రశేఖర్, మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు ఏజండ్ల మాధవి, వజ్రాల కమలాదేవి, ఉపాధ్యక్షురాలు శైలజ, కోశాధికారి భారతి, పద్మావతి, వీవోఏలు పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి లక్ష్మీపద్మావతి

ట్రాఫిక్ నిబంధనలపై తండ్రులకు అవగాహన కల్పించాలి

సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

అద్దంకి : విద్యార్థులు తల్లిదండ్రులకు, కుటుంబసభ్యులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని, కచ్చితంగా ఆచరిస్తారని సీనియర్ సివిల్ న్యాధికారి నాగవెంకటలక్ష్మి అన్నారు. మండల న్యాయాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బీసీ బాలికల వసతిగృహంలో శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. పోక్సో చట్టం, బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు బీసీ బాలికల వసతి గృహం నుంచి కోర్టు భవనాల సముదాయం వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐ సుబ్బరాజు, ఎస్సై ఖాదర్‌బాషా, న్యాయవాదులు శ్రీనివాసరావు, ప్రకాషరావు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయాధికారులకు సన్మానం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అద్దంకి బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం బార్ అసోసియేషన్ హాల్ లో న్యాయాధికారులు నాగవెంకటలక్ష్మి, శ్రీసీత, మహిళా న్యాయవాదులను ఘనంగా సన్మానించారు.

అద్దంకిటౌన్ : మహిళలు అన్ని రంగాలలో ముందంజలో దూసుకుపోతున్నారని, మహిళను అందరం గౌరవించాలని పలువురు వక్తలు అన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించార ఏపిపిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళ ఉద్యోగులను సత్కరించారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో కార్యాలయంలో సీనియర్ రోటరీ మహిళ సభ్యులు జాగర్లమూడి శివకుమారి, నర్రా శ్రీలక్ష్మి, కృష్ణవేణి, కోట అందజమ్మను సత్కరించారు. బాపట్ల జిల్లాలో జరిగిన వేడుకలలో అద్దంకి ఆర్టీసీ డిపో సీనియర్ కండక్టర్ లేబూరి ఉ మామహేశ్వరి పాల్గొని తన సందేశాన్ని విన్పించడంపై ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

మేదరమెట్ల : మహిళలు ఉన్నత విద్యా అభ్యసంతోనే సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందగలని ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి అన్నారు. శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు తుళ్ళూరి వెంకటరమణను వెలుగు కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రాజ్యం, మారుతి, మాణిక్యరావు, ఏపీఎం భాస్కర్, సీసీలు మస్తాన్ వలి, సాంబయ్య, మేరి కుమారి, కోటేశ్వరరావు, వి వోఏలు పాల్గొన్నారు.

మార్టూరు : వెలుగు కార్యాలయంలో ఏపీఎం సురేంద్ర, ఉపాధి ఏపీవో లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వీవోఏలు, డ్వాక్రామహిళలు,మండల సమాఖ్య సభ్యులు ప్రత్యేకంగా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటలపోటీలను నిర్వహించి బహుమ తులను అందజేశారు. దీపిక, రామేశ్వరమ్మను సత్కరించారు.

చినగంజాం : మహిళల అభ్యున్నతితోనే సమాజ ప్రగతి సాధ్యమని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య అన్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ ఆధ్వర్యంలో మహిళా గ్రామ రెవెన్యూ అధికారులు, కార్యాలయంలోని మహిళా ఉద్యోగులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మహిళా ఉద్యోగులను తహసీల్దార్ సన్మానించారు. వెలుగు కార్యాలయ ఆవరణలో ఏపీఎం పెద్దసుబ్బారావు ఆధ్వర్యంలో వీవోఏలు, డ్వాక్రా మహిళలకు పోటీలు నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకురాలు యార్లగడ్డ లక్ష్మి, పర్చూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జరుబుల సంధ్యారాణి, ఏపీవో లక్ష్మీదేవి, హెచ్ఎం రత్నకుమారి, సీహెచ్‌సీ వైద్యాధికారి కీర్తిసరోజ్, మహిళా కానిస్టేబుల్ కవితను సన్మానించారు.

ఓర్పు, సహనమే మహిళల ఆభరణాలు

సీనియర్ సివిల్ న్యాయాధికారి ప్రశాంతి

పర్చూరు : ఓర్పు, సహనమే సమాజంలో మహిళలకు ఆభరణాలని, సమాజంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న మహిళలను ఆదర్శంగా తీసుకోవాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.ప్రశాంతి అన్నారు. వెలుగు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో పర్చూరు కోర్టు భవనాల సముదాయ న్యాయాధికారులు పాల్గొన్నారు. పీఎం రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యులు దాసరి ఉషారాణి, సీసీలు విజయకుమార్, శ్రీనివాసమూర్తి, నరసింహం, ప్రమీలా, న్యాయవాధులు పాల్గొన్నారు. కారంచేడు మండల పరిధిలోని ఆదిపూడి గ్రామంలో జై జపాలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పల్నాడు జిల్లా నర్సారావుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బండారు సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి ప్రశాంతి



సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకులు

అంగన్‌వాడీలకు గ్రాట్యుటీపై హర్షం

అద్దంకిటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ వర్తింపచేస్తూ ప్రభుత్వం జీవోను విడుదల చేయడం పట్ల తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గడ్డం అనంతలక్ష్మి అన్నారు. శనివారం మార్కాపురం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును రాష్ట్ర కమిటీ సభ్యులు కలిశారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులతో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లి లక్ష్మీనరసమ్మ, కోశాధికారి హేమలత, కాత్యాయని, సామ్రాజ్యం ఉన్నారు.

పీ-4 సర్వేను ప్రణాళికతో నిర్వహించాలి

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు



సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో

వేటపాలెం(చీరాల), మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన పీ-4 సర్వేను ప్రతి ఇంటికీ వెళ్లి స్పష్టమైన ప్రణాళికతో నిర్వహించాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. వేటపాలెం మండలంలో శనివారం ప్రారంభమైన సర్వేను ఆర్డీవో పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పంచాయతీల లాగిన్‌లకు ఇప్పటికే ప్రతి ఇంటికీ సంబంధించిన డేటా అందుబాటులో ఉందన్నారు. సిబ్బంది విధిగా ఇంటికీ వెళ్లి 16 అంశాలపై పూర్తి డేటాను సక్రమంగా సేకరించి ఎంట్రీ చేయాలని సూచించారు. ఆయన వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.

పోరాటాలతో అందరికీ గుర్తుంటారు



ప్రతిభామూర్తుల చిత్రటాలకు నివాళులర్పిస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభామూర్తులు, ఉద్యమకారులు సమాజంలోని తాము చేసిన పోరాటాలతో అందరికీ గుర్తుంటారని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అద్దంకి డిపో ఆధ్వర్యంలో చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో ప్రతిభా మూర్తులు-మధుర స్మృతులు సభ రిటైర్డ్ టీచర్ యనమండ్ర వరలక్ష్మి అధ్యక్షతన జరిగింది. కోట సుందరమ్మ, జయలలిత చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అద్దంకి ప్రాంత స్వాతంత్ర్య సమరయోధురాలు సుందరమ్మ జీవిత విశేషాలను టీచర్ దాసరి లక్ష్మీరాజ్యం, సినీనటి, మాజీ సీఎం జయలలిత సినీ జీవిత విశేషాలను రోటరీ సభ్యురాలు కొల్లా భువనేశ్వరి తెలిపారు. మ హిళా సాధికారత గురించి జ్యోతిష్మతి వివరించారు. అనంతరం వరలక్ష్మి, పి. కామేశ్వరి, కె.భువనేశ్వరి, జ్యోతిష్మతి, లక్ష్మీరాజ్యంను సన్మానించారు. సంఘ అధ్యక్షుడు కోటయ్య, వీరయ్య, దేవపాలన, ప్రసాద్, త్రిమూర్తులు, రాఘవరావు, నాగేశ్వరరావు, బ్రహ్మం, మలాది శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి పాల్గొన్నారు.

కాలువల నిర్మాణానికి ఆక్రమణల తొలగింపు

బల్లికురవ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన అంబడిపూడి గ్రామంలో సైడు కాలవల నిర్మాణానికి ప్రధాన వీధిలో ఉన్న ఆక్రమణలను తొలగించే పనులు శనివారం నుంచి ప్రారంభించారు. టీడీపీ నేత దద్దాల అంజయ్య పర్యవేక్షణలో కాలవల ఏర్పాటుకు పనులు చేపడుతున్నారు.

కారును ఢీకొన్న లారీ

బల్లికురవ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి రామాంజనేయపురం వద్ద శనివారం కారును లారీ ఢీకొట్టింది. ఈప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినడంతో పాటు డ్రైవర్‌కు గాయాలయ్యాయి నర్సారావుపేట వైపు నుంచి వస్తున్న కారును రామాంజనేయపురం వద్ద రోడ్డుపైకి వస్తున్న లారీ వెనక నుంచి ఢీకొట్టింది. గాయపడిన డ్రైవర్‌ను వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్సను అందించారు.

కొండపై గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

బల్లికురవ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాత మల్లాయపాలెం గ్రామ సమీపంలో ఉన్న బోడుకొండపై గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం మేకల కాపరులు కొండపై కంపు రావడంతో గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. సంతమాగులూరు సర్కిల్ సీఐ కె.వెంకట్రావు వెళ్లి పరిశీలించగా చెట్టుకు మృతదేహం వేలాడుతుంది. గ్రానైట్ క్వారీల్లో పనులకు వచ్చే ఇతర రాష్ట్రాలకు చెందినవాడిగా అనుమానిస్తున్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

పర్చూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : వీధి కుక్కల నియంత్రణ చర్యలు చేపడతామని పంచాయతీ కార్యదర్శి ఆళ్ల మస్తాన్‌రావు తెలిపారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో భౌభౌలతో బేంబేలు అనే కథనంపై అధికారులు స్పందించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కుక్కలను పట్టించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ట్రెజరీ అధికారులు సహకరించాలి

అద్దంకిటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఉద్యోగులకు సంబంధించి కుటుంబ పెన్షనర్‌ల అడిషినల్ క్యాంటమ్ పెన్షన్ విషయంలో ట్రెజరీ అధికారులు సహకరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా శాఖ-2 అధ్యక్షుడు రావూల బాపయ్య చౌదరి కోరారు. శనివారం సంఘ సమావేశం పుట్టంరాజు కళాక్షేత్రంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఆయా శాఖలకు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఏప్రిల్ 12 మార్టూరు, 19న ఇంకొల్లు, 26న అద్దంకి శాఖలకు జరుగుతాయని తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి కరికమలేశ్వరరావు, కోశాధికారి పుట్టంరాజు శ్రీ రామచంద్రమూర్తి, అద్దంకి మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్, కృష్ణయ్య, కోశాధికారి కోటేశ్వరరావు, మార్టూరు, ఇంకొల్లు శాఖల సభ్యులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

వేటపాలెం(చీరాల), మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని 55-60 మధ్య వయస్సు గల వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. వేటపాలెం మండలం కొత్తరెడ్డి పాలెంలోని ఓ రొయ్యల కంపెనీ సమీపంలో మృతి చెంది పడివుండగా, ఎస్ఐ వెంకటేశ్వర్లు సమాచారాన్ని అందుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతిచెందిన వ్యక్తిని యాచకుడిగా పోలీసులు భావిస్తున్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

మార్టూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తిచెంది పురుగుమందును తాగి తాళ్లూరి చినబాబు (41) ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని వలపర్ల గ్రామ ఎస్సీకాలనీలో చినబాబు నివాసముంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు మగపిల్లలున్నారు. వలపర్ల, నాగరాజుపల్లి మధ్య మొక్కజొన్న తోటలో శనివారం చినబాబు మృతదేహాన్ని పొలంవెళ్లినవారు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. చినబాబు భార్య ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సీఐ ఎం.శేషగిరిరావు కేసు నమోదు చేశారు.



ఉప్పుటూరులోని ఎత్తిపోతలను పరిశీలిస్తున్న అధికార బృందం

ఎత్తిపోతల పథకాల పరిశీలన

పర్చూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఉప్పుటూరులో పురందేశ్వరి ఎత్తిపోతల పథకాన్ని బృందం శనివారం పరిశీలించింది. వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారిన ఎత్తిపోతల పథకాల పున రుద్ధరణకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టి సారించారు. ఈమేరకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఎత్తిపోతల పథకాల పరిస్థితిపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు విశ్రాంత డీఈతో బృందాన్ని ఏర్పాటు చేశారు. పర్చూరు వాగు, వివిధ కాల్వలు, సాగర్, కొమ్మమూరు కాలువల నీరు సద్వినియోగం చేసుకునేందుకు రైతులు, ప్రభుత్వం భాగస్వామ్యంతో నిర్మించిన పథకాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి రైతులకు సాగునీరు అందించాలని ఏలూరి సంకల్పించారు. కార్యక్రమంలో అధికారులతోపాటు, నీటి సంఘం ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన వివరాలు

అద్దంకి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పలు కార్యక్రమాలకు హాజరు కానున్నారు. ఉదయం 10 గంటలకు చిలకలూరిపేట, 10-30 గంటలకు ముప్పవరం, 11 గంటలకు చినమల్లవరం, 11-30 గంటలకు బూదవాడ, 12 గంటలకు రేణింగవరం, మధ్యాహ్నం 1 గంటకు అంబడిపూడి, 1-30గంటలకు నక్కబొక్కలపాడులో జరిగే కార్య క్రమాల్లో పాల్గొంటారు.

పండుగలు, సంప్రదాయాలను గౌరవించాలి

అలరించిన విజ్ఞాన ప్రదర్శన



విజ్ఞాన ఎగ్జిబిషన్‌లో తెలుగు ప్రాధాన్యతపై ప్రదర్శన చూపుతున్న చిన్నారులు

చీరాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : పాపరాజుతోటలోని శ్రీరాఘవేంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్లో డైరెక్టర్ గవిని మణికుమార్ ఆధ్వర్యంలో విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి హాజరయ్యారు. ఈక్రమంలో చిన్నారులు తెలుగు పండుగలు, సంప్రదాయాలు, మెదడకు మేత, సైన్స్‌తో సరదాలు, గ్రహాలు వాటి తీరు తెన్నులు, గణితంతో గమ్మత్తులు, భాషా భాగాలు, వ్యా కరణ విశేషాలు, రాజ్యాంగ నిర్మాతలు 299 మంది బంధ కవిత్వం తదితర ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరి కంటి వైద్య శిబిరానికి స్పందన

- 364 మందికి వైద్య సేవలు
- మహిళా అభ్యున్నతికి ఎమ్మెల్యే ఏలూరి కృషి
- కొనియాడిన వక్తలు



వివిధ రంగాలకు చెందిన మహిళలను సన్మానిస్తున్న ప్రముఖులు, నాయకులు

ఇంకొల్లు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) :ఎమ్మెల్యే ఏలూరి సారథ్యంలో టీడీపీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా జడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏలూరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ఉచిత మోగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పం దన లభించింది. ఏలూరి చారిటబుల్, నోవా అగ్రిటెక్, గ్రీన్‌స్పార్క్ ఫౌండేషన్ సంయుక్తంగా గుంటూరు శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో శనివారం ఉచిత మోగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 364 మందికి వైద్యసేవలు అందించారు. రక్త, బీపీ, షుగరు పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్యురాలు డా.అనూష రోగులకు పరీక్షలు నిర్వహించారు. 159 మంది కి శస్త్రచికిత్సలు అవసరంగా నిర్ధారిం చారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఏలూరి కృషిని వక్తలు కొనియాడారు. మహిళలకు కుట్టుమిషన్లు, మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేస్తూ కొండంత అండగా నిలుస్తున్నారన్నారు. అనంతరం మహిళా పోలీసులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, పంచాయితీ కార్మికులను ఘనంగా సన్మానించారు. నాగులచెరువుకట్ట వద్ద మహిళా సేవా సంస్థకు కేటాయించిన గదిని టీడీపీ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నాయుడు హనుమంతరావు, మార్క్, పాలేరు రామకృష్ణ, వీరగంధం ఆంజనేయులు, డాక్టర్ శ్యాంసుందర్,కరి శ్రీను, సంధ్య, శివాజీ, ఇంకొల్లు సీఐ రమణయ్య, ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 230 కేసుల పరిష్కారం

రూ.88,99,573 చెల్లింపునకు అంగీకారం

అద్దంకి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఇరు పక్షాలు రాజీ పడడం ద్వారా విజయం సాధించినట్లేనని సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం కోర్టు భవనాల సముదాయంలో జరిగిన లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీసీత ఆధ్వర్యంలో రెండు బెంచ్‌లలో మొత్తం 230 కేసులు పరిష్కారమయ్యాయి. ఒరిజనల్ సూట్స్ 12 (25.50 లక్షల రూపాయలు), ఎగ్జిక్యూషన్ పిటిషన్ 4 (6,58,573 రూపాయలు), క్రిమినల్ కేసులు ఐపీసీ 75, నెగోషియబుల్ ఇన్స్టుమెంట్ యాక్ట్ 11 (38.41 లక్షల రూపాయలు), ఎక్సైజ్ కేసులు 122, భరణం కేసులు 4 (18.50 లక్షలు), గృహహింస కేసులు 2 పరిష్కారం అయ్యాయి. వీటికి సంబంధించి 88,99,573 రూపాయలు చెల్లింపులకు ఇరుపక్షాల మధ్య అంగీకారం కుదిరింది. లోక్‌అదాలత్ సభ్యులు హైగ్రీవాచారి, రమణయ్య, అనూష, సంజీవ్‌బాబు పాల్గొన్నారు.

హిందూ శ్మశాన వాటికను అభివృద్ధి చేయండి

బల్లికురవ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాయపాలెం గ్రామంలో ఉన్న హిందు స్మశాన వాటికను అభివృద్ధి చేయాలని అమ్మ ఆశ్రమానికి చెందిన జ్ఞాన ప్రసూన బాబా సూచించారు. శనివారం మండలంలోని కొండాయపాలెంలోని హిందూ శ్మశాన వాటికను గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామానికి అమ్మ ఆశ్రమానికి చెందిన జ్ఞాన ప్రసూన బాబా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన గ్రామ పెద్దలతో మాట్లాడారు. గ్రామానికి చెందిన మురగొండ ఆంజనేయులు జ్ఞాపకార్థం ఆయన కుమారులు అర ఎకరం స్థలాన్ని శ్మశాన వాటికకు ఇస్తామని ముందుకు రాగా వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ధూళిపాళ్ల రామగోవిందు, అంజనేయులు పాల్గొన్నారు.


బాలికల సాధికారతకు నిరంతరం కృషి

విద్యార్థినులకు 76 సైకిళ్ల పంపిణీ



విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

చీరాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : బాలిక సాధికారతకు తాము ఎల్లప్పుడు కృషిచేస్తున్నామని, ఇటువంటి సేవలు ఎంతో ఆనందాన్నిస్తున్నాయని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా. చిలుకూరి శరత్‌బాబు, డా.అన్నపూర్ణ దంపతులు అన్నారు.శనివారం చీరాల పరిధిలోని 76 మంది నిరుపేద విద్యార్థినులకు రోటరీక్లబ్ ఆఫ్ చీరాల, వేటపాలెం, క్షీరపురి రోటరీ క్లబ్ చీరాల, వేటపాలెం ఆధ్వర్యంలో గవర్నర్ దంపతుల ఆర్థిక సాయం రూ.3లక్షలు విలువగల సైకిళ్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా క్లబ్ సమావేశం హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో బాలికలు విద్యా రంగంలో విశేషంగా రాణించి ఉన్నత శిఖరాలను అందుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వెంకటేశ్వరరావు, సురేష్‌బాబు, పోలుదాసు రామకృష్ణ, బి.హేమంత్‌కుమార్, శ్రీనివాసరావు, ప్రసాద్, నరేంద్రబాబు, భాను ప్రసాద్, నాగమల్లేశ్వరరావు, వెంకట సురేష్, బాలికలు పాల్గొన్నారు.





రంగనాథుడి సన్నిధిలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

- 15న శ్రీవారి కల్యాణం, 16న రథోత్సవం
- విస్తృత ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పెన్నానది ఒడ్డున వెలసి ఉన్న తల్పగిరి రంగ నాథస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నా యి. 20వ తేదీ వరకు వైభవంగా జరిగే ఈ ఉత్సవాలకు అధి కారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆదివారం రాత్రి అంకురా ర్పణ కార్యక్రమంలో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. సోమ వారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి శేషవాహనంపై స్వామి వారు విహరిస్తారు. 11వ తేదీ ఉదయం సూర్యప్రభ, రాత్రి హంసవాహనం, 12న ఉదయం సింహ, రాత్రి చంద్రప్రభ వాహనం, 13న ఉదయం పల్లకీ (వెణ్ణ తాళి) రాత్రి హనుమంతసేవ, 14న సాయంత్రం పూలంగిసేవ, రాత్రి బంగారు గరుడ సేవ, 15వతేదీ ఉదయం పూలంగిసేవ, రాత్రి శ్రీవారి కల్యాణం, ఆ తర్వాత గతజవాహన సేవ ఉంటుంది. 16వ తేదీ ఉదయం రథోత్సవం, పూలంగి సేవ, రాత్రి పొన్నవాహనం సేవ, 17న ఉదయం తిరుప్పావైనాడల్, రాత్రి అశ్వవా హనం, 18న ఉదయం ముసుగుల సేవ, చక్రస్నానం, తీర్థవాది, సాయంత్రం పుణ్యకోటి విమానం. 19న సాయంత్రం పుష్పయాగం, రాత్రి దవనోత్సవం, రాత్రి ధ్వజావరోహణం, 20న రాత్రి తెప్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.



నా ఆకాంక్షలు, లక్ష్యాలు వేరు..

ముందున్న సవాళ్లు వేరు!

- భూ సమస్యలు, కబ్జాలు ఇక్కడ ఎక్కువే
- కాబట్టి వాటి పరిష్కారమే ముఖ్యం
- ఆ తర్వాతే నా ప్రణాళికలు అమలు
- కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ

INTERVIEW



కందుకూరు వంటి వెనుక బడిన ప్రాంతం అభివృద్ధి కోసం నేను కొన్ని లక్ష్యాలు పెట్టుకున్నా. అయితే క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే భూ సమస్యలే ఎక్కువగా ఉన్నాయి. కాబట్టి ఆ సమస్యలు పరిష్కరించి పేదవారికి న్యాయం చేయడమే నా మొదటి లక్ష్యం' అని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ అన్నారు. భూ సమస్యలు, భూముల కబ్జాలకు సంబంధిం చిన సమస్యలు, అధికారుల తప్పిదాల వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించటంలో తలమునకలై ఉన్నట్లు చెప్పారు. కందుకూరు రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి పలు అంశాలపై ఆమె 'ఆంధ్రజ్యోతి' తో ముచ్చటించారు. ఆ వివరాలు...

? మరి మిగతా భూ సమస్యల సంగతేంటి

! అనేక భూ సమస్యలు పత్రికల ద్వారా, ప్రజాప్రతిని ధుల ద్వారా నా దృష్టికి వచ్చి ఉన్నాయి. మరికొన్ని బాధిత రైతుల ద్వారా కూడా తెలిశాయి. ఒక్కో సమస్య పరిశీలన కోసం వెళ్తే మరికొన్ని సమస్యలు వెలుగుచూస్తున్నాయి. అన్నిటినీ పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తాను.

? కందుకూరు ప్రగతికి మీ లక్ష్యాలు

! కందుకూరు డివిజన్ బాగా వెనుకబడిన ప్రాంతం కనుక ఇక్కడ మహిళా సాధికారత కోసం, చిన్నారుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి అమలు చేయాలనుకున్నా. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకున్నాను. అయితే ఇక్కడ బాధ్యతలు చేపట్టాక భూ సమస్యలు పరిష్కారానికే సమయం సరిపోవడం లేదు.

? భూ సమస్యలు అంత ఎక్కువగా ఉన్నాయా

! ఈ ప్రాంతంలో భూ సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. ముఖ్యంగా భూ కబ్జాలు, భూ రికార్డుల తారుమారు వంటివి మా దృష్టికి వస్తున్నాయి. అలాగే అధికారులు చేసిన ఆన్‌లైన్ తప్పిదాల కారణంగా నిరుపేద రైతులు అవస్థలు పడుతున్నారు. మా భూమి మాకుకాకుండా పోతుందేమోనన్న ఆందోళనతో ఎంతోమంది నావద్దకు వస్తున్నారు. దీంతో నేను పెట్టుకున్న లక్ష్యాలు వేరైనా ముందు భూసమస్యల పరిష్కారం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు మేలు చేయాలని సంకల్పించాను.

? మరి ఆ ప్రయత్నంలో సఫలీకృతం కాగలుగుతున్నారా?

! ఇప్పటికే కొన్ని సమస్యలు పరిష్కరించగలిగాము. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న గర్భకండ్రిక భూముల సమస్యకు ఇటీవల పరిష్కారం లభించింది. త్వరలోనే ఆయా గ్రామాలలో గ్రామసభలు పెట్టి హేతుబద్ధంగా రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోనున్నాం. అలాగే భూకబ్జాలు, ఆన్‌లైన్ తప్పిదాలకు సంబంధించి మా దృష్టికి వచ్చిన అనేక కేసులను పరిష్కరించగలిగా. పోర్టు అనుబంధ పరిశ్రమల కోసం జరుగుతున్న భూసేకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా ఈ ప్రాంత రైతులకు మేలు జరిగేలా నావంతు బాధ్యతలను నిర్వర్తిస్తుండటం సంతృప్తికరంగా ఉంది.

? రామాయపట్నం పోర్టు, అనుబంధ పరిశ్రమల భూసేకరణ సంగతేమిటి

! భూసేకరణ అధికారిగా వేరేవారు ఉన్నారు. సబ్ కలెక్టరుగా ఈప్రాంత రైతులకు అన్యాయం జరగకుండా చూడటం కోసమే నా ప్రయత్నాలు ఉంటాయి. భూ పరిహారం చెల్లింపులో ఒకరి బదులు మరొకరి బ్యాంకు ఖాతాకు జమకావటం, తక్కువ మొత్తం జమకావటం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నందున పరిశీలన చేసి ఈ ప్రాంత రైతులకు మేలు జరిగేలా ప్రయత్నిస్తాను. అలాగే పునరావాసం, ఇతర అంశాలను పరిశీలించి ప్రజలకు మేలుజరిగేలా చేస్తాను. ఇక పరిహారం విషయం ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం జరుగుతుంది.

- కందుకూరు, (ఆంధ్రజ్యోతి)

బిలకూట క్షేత్రంలో నేటి నుంచి ఉత్సవాలు

బిట్రగుంట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : కొండబిట్రగుంటలోని బిలకూట క్షేత్రంలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. కావలి ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి, ఆర్డీవో వంశీకృష్ణల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానుండటంతో కొండబిట్రగుంట, కొత్తూరు గ్రామాల మధ్య లింక్ రోడ్డు, పాతబిట్రగుంట, గౌరవరం మధ్య పంచాయతీ రోడ్డు మరమతు పనులు జోరుగా సాగుతున్నాయి. అలాగే ముంగమూరు జాతీయ రహదారి నుంచి పాతబిట్రగుంట వరకు వీధి దీపాలకు విద్యుత్ లైన్ల ఏర్పాటు దాదాపుగా పూర్తి అయింది. కాగా, ఆదివారం ఉదయం 8 గంటలకు గిరిప్రదక్షిణ ప్రారంభం అవుతుంది. ఈ ఏడాది స్వామివారి చిత్రపటంతో కాకుండా ఉత్సవ విగ్రహాలతో గిరి ప్రదక్షిణ ఉంటుంది. సాయంత్రం స్వామివారికి పూలంగి సేవ, మేదిని (భూమి) పూజ, రాత్రి అంకురార్పణ కార్యక్రమాలు ఉంటాయి. సోమవారం ఉదయం తిరుమంజనం, సాయంత్రం పూలంగి సేవ, రాత్రి ధ్వజారోహణం, కొడిముద్దలు, శేషవాహణ సేవ ఉంటుంది. 11న సాయంత్రం పూలంగి సేవ, రాత్రి హనుమంత సేవ, 12న ఉదయం మోహిని ఉత్సవం, రాత్రి గరుడసేవ, 13న ఉదయం మొక్కుబడులు, సాయంత్రం చందన అలంకరణ, తెప్పోత్సవం, గజవాహనసేవ జరుగుతుంది. 14వ తేదీ ఉదయం స్వామి, అమ్మవార్ల కల్యాణం, సాయంత్రం రథోత్సవం, పూలంగిసేవ, రాత్రి అశ్వవాహనం, 15వ తేదీ సాయంత్రం పుష్పయాగం, రాత్రి స్వామివారి ఏకాంత సేవ, ధ్వజావరోణ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి.



● ఏర్పాట్ల పరిశీలన

శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి, అధికారులు పరిశీలించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అదనపు లోడ్ త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్‌లు ప్రారంభించారు. అనంతరం రథం తిరిగే ప్రాంతాలను పరిశీలిం చారు. శ్రీవారి నిజపాదాల కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించా రు. ఈ కార్యక్రమంలో ఈవో రాధాకృష్ణ టీడీపీ నాయకులు రాజకుమార్, నాగేశ్వరావు, వెంకటేశ్వరరెడ్డి, విజయ్‌కుమార్ యాదవ్, సుధీర్‌బాబు పాల్గొన్నారు.


కోరం లేక జడ్పీ సమావేశం వాయిదా

నెల్లూరు (జడ్పీ), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జడ్పీ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 11 గంటలకు సమావేశం జరిగింది. బడ్జెట్‌తోపాటు గృహనిర్మాణం, డ్వామా, వైద్య, ఆరోగ్య శాఖలపై సమీక్ష చేయాల్సి ఉంది. అయితే శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్స వం కావడం, ఆ కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం, వాటికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులంతా హాజరవడంతో జడ్పీ సమావేశానికి సభ్యులు ఎవరూ రాలేదు. దీంతో కోరం లేక సమావే శాన్ని వాయిదా వేస్తున్నట్లు అరుణమ్మ ప్రకటించారు. కాగా, మహిళా దినోత్సవం సందర్భంగా పలువురిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

మండుతున్న ఎండలు..

పెరుగుతున్న విద్యుత్ వినియోగం

నెల్లూరు (జడ్పీ), (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు పోటీగా విద్యుత్ వినియోగం కూడా పెరిగిపోతోంది. ఈ నెల ఆరంభం నుంచి ఎండలు మండిపోతుండటంతో ఉప శమనం కోసం ప్రజలు విద్యుత్ పరికరా లను విరిగా వినియోగిస్తున్నారు. గృహా లు, కార్యాలయాలు, దుకాణాలు ఇలా అన్ని భవనాలలో ఏసీలు, ఫ్యానులు, కూలర్ల వాడకం అధికమైంది. దీంతో పగటిపూట కంటే రాత్రిపూట కరెంటు వాడకం మరింత ఎక్కువగా ఉంటోంది. జిల్లాలో విద్యుత్ కోతలు విధించనప్పటికి విని యోగం మాత్రం క్రమేపి పెరిగిపో తోంది. గత ఏడాది మార్చి మొదటి వారంలో 7.726 మిలియన్ యూనిట్ల వాడకం ఉండగా ఈ ఏడాదిలో ఆ వాడకం 9.488 మిలియన్ యూనిట్లకు పెరిగింది. ఫిబ్రవరి 1న 8.030 మిలి యన్ యూనిట్ల వాడకం ఉండగా 10వ తేదీకి ఆ వాడకం 9.488 మిలియన్ యూనిట్లకు పెరిగింది. అలాగే మార్చి నెలలో 1న కొంత మేర తగ్గి 8.863 మి.యూ, 2న 8.821, 3న 8.994, 4న 9.223, 5న 9.133 మిలి యన్ యూని ట్లుగా నమోద యింది. ఏప్రిల్, మే నెలలో ఈ వాడకం మరింత పెరగనుంది.



నగర పంచాయతీగా వింజమూరు

కూటమి ప్రభుత్వంలో మళ్లీ తెరపైకి

ఉదయగిరి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి నియోజకవర్గంలో వింజమూరుది ప్రత్యేకస్థానం. వ్యాపార, విద్యాసంస్థలు, వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందడమే గాక ఏడాదికేడాది పట్టణ జనాభా పెరుగుతూనే ఉంది. అందుకు అనుగుణంగా నగర పంచాయతీ మార్చాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో (2014-19) వింజమూరును నగర పంచాయతీగా తీర్చిదిద్దాలని ప్రతిపాదనలు సైతం వెళ్లాయి. అయితే, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను పక్కన పెట్టేసింది. ప్రస్తుత కూటమి ప్రభు త్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వింజమూరు పట్టణ అభి వృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణాన్ని నగర పంచా యతీగా మార్చేందుకు చర్యలు చేపట్టనున్నట్లు పలు సమావేశాల్లో వెల్లడించారు.



● పంచాయతీ తీర్మానం

మేజర్ పంచాయతీ అయిన వింజమూరులో 2021 లెక్కల ప్రకారం 23 వేల మంది జనాభా ఉంది. ప్రస్తుతం ఆ సంఖ్య 42 వేల వరకు ఉంటుందని అంచనా. ఇటీవల పంచాయతీ సర్పంచ్ సుజన అధ్యక్షతన జరిగిన పాలకవర్గ అత్యవసర సమావేశంలో పట్టణాన్ని నగర పంచాయతీగా మార్చాలని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. నగర పంచాయతీగా వింజమూరు మార్పు చెందింతే అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి ప్రత్యేక నిధులు మంజూరు కానుండటంతో రహదారులు, వీధిదీ పాలు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడుతుంది. అలాగే పట్టణంలో స్థలాలు, భూముల విలువ పెరిగి ప్రజ లు, రైతులు ఆర్థికంగా స్థిరపడే అవకాశాలు ఉంటాయి.

ప్రభుత్వానికి తీర్మాన ప్రతులు

వింజమూరు పంచాయతీని నగర పంచాయతీగా స్థాయి పెంచాలని కోరుతూ ఇటీవల పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ తీర్మాన ప్రతులను సర్పంచ్ సుజన ఎమ్మెల్యే సురేష్ ద్వారా ప్రభుత్వానికి పంపనున్నారు.

- శివకుమార్, పంచాయతీ ఈవో, వింజమూరు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆదివారం) : 6.23

సహరి (సోమవారం) : 5.05

జాతీయ లోక్‌అదాలత్‌లో

25,111 కేసుల పరిష్కారం

నెల్లూరు (లీగల్), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా శనివారం జిల్లావ్యాప్తంగా 25,111 కేసులు పరిష్కారానికి నోచుకున్నాయి. లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఉదయం నెల్లూరులోని జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ కేసుల్లో రాజీ అయ్యే అవకాశం ఉన్నప్పుడు రాజీ చేసుకోవడం ఇరు పార్టీలకు ఎంతో మంచిదని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు కె. వెంకట నాగపవన్, ఎస్. శ్రీనివాస్, జి.స్వాతి, శారద, లావణ్య, కె.వాణి తదితరులు పాల్గొన్నారు. కాగా, లోక్ అదాలత్‌లో



కావలిలో కేసులను పరిష్కరిస్తున్న న్యాయాధికారి శోభ

రాష్ట్రస్థాయిలో జిల్లాకు ప్రథమస్థానం

అత్యధిక కేసుల పరిష్కారంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. వరుసగా ప్రథమ స్థానం దక్కడి ఇది ఐదవసారి. లోక్‌అదాలత్‌లో నెల్లూరులో 10,881 కేసులు, కోవూరులో 3,976, కావలిలో 2,615, ఉదయగిరిలో 1,550, ఆత్మకూరులో 2,168, గూడూరులో 341, వెంకటగిరిలో 2061, కోటలో 300, నాయుడుపేటలో 55, సూళ్లూరుపేటలో 1164 కేసులు మొత్తం 25,111 కేసులు పరిష్కరింపబడ్డాయి. ఈ సందర్భంగా రూ.2,64,53,501 బాధితులకు చెల్లించనున్నారు.

మహిళల ఆర్థిక పరిపుష్టే

ప్రభుత్వ లక్ష్యం

● మహిళా దినోత్సవంలో మంత్రి ఫరూఖ్ వెల్లడి

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించి అన్ని రంగాల్లో ముందంజలో రాణించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మైనార్టీ, న్యాయ వ్యవహారాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నస్యం మహమ్మద్ ఫరూక్ తెలిపారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబ రాలు నగరంలోని శ్రీవెంకటేశ్వర కస్తూరిబా కళాక్షేత్రంలో అంబరాన్ని అంటాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి ఫరూక్ పాల్గొని ప్రారంభించారు. మహిళల కోసం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మంత్రి వివరించారు. తొలుత సెల్ఫీ బూత్‌ను, మెప్మా బృందం ఏర్పాటు చేసిన స్టాళ్లను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రారంభించారు. అలాగే పోలీసు, రిజర్వు బ్యాంకు, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ స్టాళ్లు ఆకట్టుకున్నాయి.

● ఓర్పు - నేర్పు - సహనం మహిళల సొత్తు

కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఓర్పు - నేర్పు - సహనం వంటి గుణాలు మహిళలు సొత్తు అని అన్నారు. జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకొని బలపడే శక్తి మహిళలకే ఉందని స్పష్టం చేశారు. కుటుంబపరంగా ఎన్నో పాత్రలు పోషిస్తున్నా ఆత్మ విశ్వాసం మంచి ఆలోచనలు మనోధైర్యం, ఆత్మగౌరవం, ఏదైనా ఒక లక్ష్యాన్ని సాధించాలనే ధ్రుడ సంకల్పం ఉంటే దేన్నైనా సాధిస్తారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన మహిళా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మహిళలకు చెక్కు అందచేస్తున్న మంత్రి ఫరూఖ్, ఎమ్మెల్యే ప్రశాంతి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి, పక్కన కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు

● చదువుతోనే సమానత్వం

వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ మహిళలు బాగా చదువుకోవాలని చదువుతోనే అన్ని రంగాల్లో సమానత్వం సాధిస్తారని తెలిపారు. మహిళాభివృద్ధికి నాడు టీడీపీ బీజం వేస్తే నేడు కూటమి ప్రభుత్వం సారథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు రూ.440 కోట్ల మెగా చెక్కులను మంత్రి ఫరూఖ్ అందజేశారు. సుకన్య సమృద్ధి యోజన కింద 925 మందికి పాస్‌బుక్కులు, అంధులకు ఆర్థిక అక్షరాస్యత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ట్రైకార్ డైరెక్టర్ అనురాధ, డీఆర్‌డీఏ, మెప్మా, ఐసీడీఎస్ పీడీలు నాగరాజకుమారి, రాధమ్మ, సుశీల, డీఎంహెచ్‌ఓ సుజాత, పరిశ్రమల శాఖ జీఎం మారుతీప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్, ప్రదీప్‌కుమార్, హ్యాండ్‌లూమ్ ఎండీ వరప్రసాద్, పలువురు జిల్లా అధికారులు పర్యవేక్షించారు.



కావలి: చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, టీడీపీ నేతలు

మహిళల ఆర్థిక స్వావలంబనతోనే సమాజాభివృద్ధి

● ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ● మగువలకు సన్మానం

● కావలి, కందుకూరులో పొదుపు సభ్యులకు రుణాల చెక్కులు అందజేత

కందుకూరు: చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, కమిషనర్ అనూష, పొదుపు సంఘాల లీడర్లు



కావలి టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ మాజీ రీజినల్ ఛైర్‌పర్సన్, టీడీపీ మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీదేవిచౌదరి అధ్యక్షతన బృందావన కాలనీ కల్యాణ మండపం, ఐసీ డీఎస్, పొదుపు మహిళల సమక్షంలో రెడ్‌క్రాస్ భవనంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, ఆర్డీవో వంశీకృష్ణ పాల్గొని జ్యోతి ప్రజ్వళన చేశారు. అనంతరం మండప ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి 18స్వయం సహాయక సంఘాలకు రూ.1.52కోట్లు విలువ చేసే చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సౌజన్య, న్యాయవాది గొట్టిపాటి మనోరమ, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబు నాయుడు, ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు, టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబు రావు, పోట్లూరి శ్రీనివాసులు, తిరివీది ప్రసాద్, ఏగూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● మహిళా రెడ్‌క్రాస్ విభాగం ఆధ్వర్యంలో..

రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్ పర్యవేక్షణలో జరిగిన వేడుకలో ఎమ్మెల్యే పాల్గొని మహిళా పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు, మొక్కలు అందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, పట్టణ ప్రముఖులు దాతలు బచ్చు వీరస్వామి, మోడరన్ నరసింహారావు, అరికట్ల మధుసూదన్‌రావు, చంద్ర, రెడ్‌క్రాస్ బాధ్యులు రవికుమార్, పార్వతీశంకర్, ఇలీంద్ర శ్రీవాణి, జమున, షమ, హరనాథ్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే జనసేన కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ వేడుకలో పాల్గొన్నారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

స్థానిక టీడీపీ కార్యాలయంలో 87మంది లబ్ధిదారులకు రూ.93.62లక్షలను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే రికార్డుస్థాయిలో రాష్ట్రంలో కావలి మూడోస్థానంలో నిలిచినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు ధ్యేయమన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, పమిడి రవికుమార్ చౌదరి, మాలేపాటి నాగేశ్వరరావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, జ్యోతి బాబూరావు, ఆవుల రామక్రిష్ణ, ఉప్పాల వెంకట్రావు పాల్గొన్నారు.

● కందుకూరు:స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ అనూష ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో 279గ్రూపుల మహిళలకు రూ.15.2కోట్ల రుణాల చెక్కును, రూరల్ మండలంలోని 45గ్రూపులకు రూ.5.26కోట్ల రుణ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.అనూష, సెర్ప్ ఏరియా కో ఆర్డినేటర్ సింహాద్రి, దామా మల్లేశ్వరరావు, వడ్డెళ్ల రవిచంద్ర, షేక్ రఫీ, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధుబాబు, ముచ్చు శ్రీనివాసరావు, కల్లూరి శైలజ, పువ్వాడి మౌనిక, మురారిశెట్టి సుధీర్, చుండూరి శ్రీను పాల్గొన్నారు.

● పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో..

వివిధ సంఘాలతో పాటు రాజకీయ పార్టీల ఆధ్వర్యంలోనూ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన మహిళలతో పాల్గొని కేకు కట్‌చేసి మహిళాదినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సౌజన్యను సత్కరించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో జరిగిన వేడుకలో నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొన్నారు. అలాగే బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) మహిళావిభాగం ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన వేడుకలో బీటీఏ నాయకులు బండి ధనమ్మ, అనూరాధ, ఈశ్వరమ్మ, మంగమ్మ, సుభాషిణి, అరుణ, షర్మిల, కావలి ఎంఈఓ బండి గోవిందయ్య పాల్గొన్నారు.

● కావలి: ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమవసతి గృహాల సముదాయంలో రెడ్‌క్రాస్, టీమ్ సేవియర్స్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ఆర్డీవో ఎం.వంశీక్రిష్ణ పాల్గొని 139మంది విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేశారు. వసతిగృహ అధికారిణిలు ప్రసన్న, విజయలక్ష్మీ, సునీత, మంజులను సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు రవిప్రకాష్, హరినారపరెడ్డి, వాణి, పార్వతి శంకర్, నయీమ్, ప్రణీత్, సౌందర్య, దీపికలు పాల్గొన్నారు.



లింగసముద్రం : మహిళలను సన్మానిస్తున్న ఏపీఎం సింహాద్రిరావు



వలేటివారిపాలెం : చిన్నారులతో అంగన్‌వాడీ కార్యకర్తలు



కొండాపురం: బహుమతి అందజేస్తున్న ఏపీఎం కాంతారావు, సీసీలు, సభ్యులు

● కావలి రూరల్: రూరల్ సీఐ జి.రాజేశ్వరరావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లోని మహిళా సిబ్బందికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐలు బాలక్రిష్ణ, తిరుమల రెడ్డి, బాజీబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

● అల్లూరు: స్థానిక రామకృష్ణ విద్యాసంస్థల మైదానంలో నాబార్డ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఆర్‌డీ సంస్థ డైరెక్టర్ బషీర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ శ్రీనివాస్, డ్వామా డీడీఎం బాబు, కో ఆపరేటివ్ బ్యాంకు జిల్లా జనరల్ మేనేజర్ లలిత, హౌసింగ్ ఈఈ మాధవరావు, ఎంపీడీఓ రజనీకాంత్, జిల్లా యానాది సమాఖ్య అధ్యక్షురాలు బాపట్ల సత్యవతమ్మ పాల్గొన్నారు.

● లింగసముద్రం: మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మండల మహిళా సమాఖ్య ఏపీఎం సింహాద్రిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొదుపు మహిళలకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. అనంతరం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మాలతి, సీసీ నారాయణమ్మ, అకౌంటెంట్ అర్చనలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సీసీలు మాధవ, మాధవరావు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం: చుండిలో జరిగిన వేడుకలో సూపర్‌వైజర్ సునీత, కార్యకర్తలు రాజ్యలక్ష్మీ, జ్యోతి, రాధ, అరుణ, కోటేశ్వరి, సుశీల, రమణమ్మ పాల్గొన్నారు.

● కొండాపురం: స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన వేడుకలో ఏపీఎమ్ కాంతారావు పాల్గొని మహిళలకు లెమన్‌స్పూన్, మ్యూజికల్ చైర్, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులఅందజేసి సీసీలను సన్మానించారు. కార్యక్రమంలో మండల సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

● ఉలవపాడు: బహుజన ఉపాధ్యాయ అసోసియేషన్ సభ్యులు స్థానిక అంబేడ్కర్ బొమ్మ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంచాయతీ పారిశుధ్య మహిళా కార్మికులను కానుకులతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 రమణయ్య, కావలి ఎంఈవో బండి గోవిందయ్య, సర్పంచ్ నాగలక్ష్మీ పాల్గొన్నారు. అలాగే స్థానిక పంచాయతీ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ లీడర్ ఇందిరమహిళలకు సన్మానించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యురాలు ఐశ్వర్య, చాగొల్లు సర్పంచ్ లత, పంచాయతీ ఈవో వీరయ్య, పాస్టర్ కుమార్ పాల్గొన్నారు.

● ఆత్మకూరు: స్థానిక పోలీస్ డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో మహిళల చేత కేక్ కట్ చేయించి స్వీట్లు పంపిణీ చేశారు. మహిళా పోలీసులను సత్కరించారు. వ్యాసరచన పోటీల లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు, సంగం సీఐలు గంగాధర్, వేమారెడ్డి, ఎస్ఐలు జిలానీ, సాయిప్రసాద్, ఆర్టీసీ డిపో మేనేజర్ కరీమున్నీసా, పట్టణ వైద్యురాలు ఆస్మా, ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ కామేశ్వరి పాల్గొన్నారు.

● చేజర్ల: స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన వేడుకలో మహిళలకు పలురకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ డీవో విజయలలిత, ఏపీఎమ్ స్వజన తహసీల్దారు మురళి, ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి, రావిలక్ష్మీనరసారెడ్డి రెడ్డి వివోఏలు, మహిళలు పాల్గొన్నారు.

● ప్రజాసంఘాల ఆధ్వర్యంలో

● ఉదయగిరి: స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి కోడె రమణయ్య, యూటీఎఫ్ నాయకులు వాణి, సువార్తమ్మ, ఏడుకొండలు, దుర్గాప్రసాద్, సుబ్బారెడ్డి, ఫణిరాజ్, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమీలాదేవి, ఆవాజ్ కమిటీ నాయకులు నాయబ్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు.

● దుత్తలూరులో: మండల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ఎస్ఐ ఆదిలక్ష్మిని సన్మానించారు. అలాగే పోలీస్‌స్టేషన్‌లో జరిగిన వేడుకలో టీడీపీ నాయకులు కాకర్ల మధు, చీదర్ల మల్లికార్జున, చిన్నపరెడ్డి, హరిగోపాల్, వెంగళరెడ్డి, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

● మహిళా పోలీసులకు సన్మానం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ పరిధిలోని ఎస్ఐ ఆదిలక్ష్మి, మహిళా పోలీసులను సీఐ వెంకటరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, శివకృష్ణారెడ్డి, రఘునాథ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కావలి రూరల్: మహిళలను శాలువాలతో సన్మానించిన సీఐ, ఎస్ఐలు



ఉలవపాడు: పారిశుధ్య మహిళా కార్మికులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచి నాగలక్ష్మి



ఆత్మకూరులో కేక్ కట్ చేస్తున్న మహిళలు



చేజర్ల: వేడుకల్లో పాల్గొన్న అధికారులు, మహిళలు



ఉదయగిరి: మహిళా పోలీసులకు సన్మానం

న్యూస్ బాక్స్

కాశీవిశ్వేశ్వరురుడికి ప్రత్యేక పూజలు



కాశీవిశ్వేశ్వరస్వామికి పూజలు చేస్తున్న రాజరాజేశ్వరానందస్వామి

సంగం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమనకొండలో ఉన్న రాజరాజేశ్వరీదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పాల్గుణ మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శనివారం తెల్లవారుజామున పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కాశీవిశ్వేశ్వరస్వామికి క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వాటర్ కూలర్ వితరణ

ఉదయగిరి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన జిల్లా ఆవాజ్ కమిటీ సీనియర్ నాయకుడు ఎస్ఎం బాషా వాటర్‌కూలర్ బహూకరించారు. తన తల్లిదండ్రులు షేక్ చినమదార్ సాహెబ్, రంతూబీల జ్ఞాపకార్థం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తన మిత్రుడు నాయబ్‌రసూల్ చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయుడు షేక్ నాయబ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు బాషాను అభినందించారు.

ఉపాధి హామీ పనులపై విచారణ



ఉపాధి కూలీల జాబ్ కార్డు తనిఖీ చేస్తున్న సామాజిక తనిఖీ బృందం

సీతారామపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను శనివారం సామాజిక తనిఖీ బృందం పరిశీలించింది. మండలంలోని 14 పంచాయతీల్లో 2023 మార్చి నుంచి 2024 ఏప్రిల్ వరకు ఉపాధి హామీ పథకం కింద 8 కోట్ల 35లక్షల 69 వేల రూపాయలతో చేపట్టిన పనులను పరిశీలించారు. పనులు చేసిన కూలీల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే కాకర్ల



ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా సాధన సమితి సభ్యులు

ఉదయగిరి, మార్చి 8 (ఆంధ్ర జ్యోతి): అందరి సహకారంతో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శనివారం ఉదయగిరి జిల్లా సాధన సమితి నాయకులు వింజమూరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్లను మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అసెంబ్లీలో ఉదయగిరి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు గళాన్ని వినిపించడం శుభపరిణామమన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు జిల్లా ఏర్పాటు అవశ్యకతను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు డాక్టర్ కె వేణుగోపాల్, డాక్టర్ మాశిలామణి, షేక్ దస్తగిరి అహ్మద్, షేక్ ఖాదర్‌బాషా, గాజులపల్లి రామిరెడ్డి, షేక్ రంతుజానీ, షేక్ హమీద్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు మురళి

చేజర్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొను గోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు బి మురళి సూచించారు. శనివారం మండలంలోని మాముడూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం పుట్టికి రూ. 19720 చెల్లిస్తుందని, కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాలో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. తక్కువ ధరకు ధాన్యం అమ్మి నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

మెగా లోక్‌అదాలత్‌లో 4,220 కేసుల పరిష్కారం

కావలి టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ కోర్టు ఆవరణలోని జాతీయ మెగా లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి యం.శోభ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రికార్డు స్థాయిలో 4,220 కేసులు పరిష్కారం అయ్యాయి. కార్యక్రమంలో బెంచ్ యెంబర్లుగా న్యాయవాదులు కెనడి, సాయి ప్రసాద్, మృదుల, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సురేంద్రరెడ్డి, కార్యదర్శి జయప్రకాష్, వైస్ ప్రెసిడెంట్ సునీల్ బాబు, లోక్‌అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి న్యాయవాదులు మనోరమ, జగన్మోహన్, ప్రసాద్‌రెడ్డి, కలీం రోజ్‌దార్ పాల్గొన్నారు. కోర్టు ప్రాంగణంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో సీనియర్ సివిల్ జడ్జి శోభను మహిళా న్యాయవాదులు సత్కరించారు.

పొగాకు బ్యారన్ల దగ్ధం

● రూ.8 లక్షల ఆస్తినష్టం

వలేటివారిపాలెం, మార్చి 8: (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని చిన్నపాలెంలో శుక్రవారం అర్ధరాత్రి 2గంటల సమయంలో రైతులు వలేటి తిరుపతయ్య, వలేటి అంజమ్మ, మాల్యాద్రికి చెందిన జాయింట్ బ్యారన్లు దగ్ధం అయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.8లక్షల ఆస్తినష్టం జరిగింది. ఒక్కొక్క బ్యారన్‌లో సుమారు 10క్వింటాళ్లకు పైగా పొగాకు ఉన్నట్లు తెలిపారు. కందుకూరు అగ్నిమాపక అధికారి వెంటేశ్వర్లు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు.

మోటారు బైక్ బోల్తా : ఒకరికి గాయాలు

కావలి రూరల్, మార్చి8 (ఆంధ్రజ్యోతి):అన్నగారిపాలెం పంచాయతీ ముందరపొట్టెమ్మ గుడి సమీపంలో శనివారం రాత్రి మోటారు బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. బోగోలు మండలం కడపాలెంకు చెందిన కోడింగారి కుమార్ మోటారు బైక్‌పై మండలంలోని తుమ్మలపెంటకు బయలుదేరాడు. కుమార్ మద్యం సేవించి ఉండటమే ప్రమాదానికి కారణంగా మారింది. వెంటనే అతన్ని 108లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

కేజీబీవీలో మంత్రి ఆకస్మిక తనిఖీ

వలేటివారిపాలెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జమీన్‌ఉప్పలపాడు కేజీబీవీ హాస్టల్‌ను శనివారం ఉదయం 7గంటల సమయంలో రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత ఆకస్మింగా తనిఖీ చేశారు. వసతి గృహ గదులు, మరుగుదొడ్లు పరిశీలించి అపరిశుభ్రతపై అసహనం వ్యక్తం చేశారు. వసతి, భోజన సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విద్యార్థినులతో కలిసి టిఫిన్ చేసి వెళ్లిపోయారు.

మాలకొండ మెట్ల మార్గం పనులు వేగవంతం చేయాలి

కందుకూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ కొండపైకి కాలినడక మెట్లు మార్గం పనులను వేగవంతం చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు శనివారం ఓ ప్రకటనలో కోరారు.

నిరుపేద మహిళకు చేయూత

కందుకూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వాసవీ సేవాదళ్ ఆధ్వర్యంలో శనివారం నిరుపేద దివ్యాంగ మహిళకు మంచం, దిండ్లు, నూతన వస్త్రాలు అందజేశారు. కొత్త మాధవరావు, గుర్రం చిన అల్లూరయ్యల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు సేవాదళ్ ప్రతినిధులు రవ్వా శ్రీనివాసులు, చక్కా కేశవ తెలిపారు.

నేడు వైసీపీ కమిటీ సభ్యుల నియామకం

లింగసముద్రం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు కమిటీ సభ్యుల నియామకం జరుగుతుందని పార్టీ మండలాధ్యక్షులు నోటి వెంకటేశ్వరరెడ్డి శనివారం చెప్పారు. సమావేశానికి మండలంలోని జడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ అనుబంధ సంస్థలోని వివిధ హోదాలోని నాయకులు, కార్యకర్తలు, హాజరు కావాలన్నారు.

●వలేటివారిపాలెం : వలేటివారిపాలెం వైసీపీ కార్యాలయంలోపార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జీ బుర్రా మధుసూధన్ యాదవ్ ఆదేశాల మేరకు ఆదివారం వైసీపీ మండల కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ అనుమోల లక్ష్మీనరసింహం శనివారం ఒక ప్రకనటలో తెలిపారు. ఆ కార్యక్రమానికి మండలంలోని వైసీపీ ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, అబిమానులు తప్పక హజరుకావాలని లక్ష్మీనరసింహం తెలియజేశారు.

రోడ్డుకిరువైపులా ముళ్లచెట్ల తొలగింపు



రోడ్డుకిరువైపులా ముళ్లచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఉదయగిరి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాయిపేట గ్రామ సమీపంలోని మలుపు వద్ద రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లను శనివారం తొలగించారు. ఆప్రాంతంలో ప్రమాదాలు అధికంగా చోటుచేసుకొని పలువురు మృత్యువాతపడగా, మరి కొందరు క్షతగాత్రులయ్యారు. దీంతో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రోడ్ల కిరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. దీంతో మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న, టీడీపీ నాయకుల పర్యవేక్షణలో ఎక్స్‌కవేటర్ సహాయంతో రోడ్డుకిరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు నరసింహ, తుమ్మల కిరణ్, శివకృష్ణ, గెట్టిబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడులో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

ఉలవపాడు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సరయూస్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో శనివారం ఉచిత గర్భసంచి క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించినట్లు నిర్వాహకులు గైనకాలజిస్టు సుస్మిత, డాక్టర్ రాజేష్‌లు తెలిపారు. ఒంగోలు హెచ్‌సీజీ ఎంఎస్ఆర్ క్యాన్సర్ సెంటర్ వైద్య నిపుణురాలు ఆళ్ల దీప్తి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గైనిక్ సమస్యలున్న మహిళలకు పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి బుధవారం ఓపీ, ప్రతి ఆదివారం ఉచితంగా షుగర్ తదితర పరీక్షలు చేపతామన్నారు.

'ప్రకాశం'లో ఆర్డునో ప్రోగ్రామింగ్ వర్క్‌షాప్



సర్టిఫికెట్లను అందజేస్తున్న ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధులు, కళాశాల టెక్నికల్ డైరక్టర్ విజయ్‌శ్రీనివాస్

కందుకూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఆర్డునో ప్రోగ్రామింగ్‌పై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. శిక్షణలో పాల్గొన్న ఈసీఈ మూడో ఏడాది విద్యార్థినులతో ఎస్‌డీసీ శిక్షణకర్త ఉమామహేశ్వరరావు మాట్లాడారు. ఆర్డునో ప్రాథమిక పరిజ్ఞానంతో పాటు ప్రోటోటైప్ ప్రోగ్రామింగ్ గురించి వివరించి ప్రాక్టికల్ ప్రాజెక్టులు రూపొందించేందుకు మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, ఈసీఈ విభాగాధిపతి డాక్టరు జీ. సురేష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నుంచి మన్నెమాల సుకుమార్‌రెడ్డి సస్పెన్షన్

కావలి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కావలి మాజీ ఏఎంసీ ఛైర్మన్ మన్నెమాల సుకుమార్ రెడ్డిని వైసీపీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శనివారం కేంద్ర కార్యాలయం పేరుతో పత్రికా ప్రకటన విడుదల చేశారు. వైసీపీ పాలనలో కావలిలో షాడో ఎమ్మెల్యేగా చక్రం తిప్పిన సుకుమార్ రెడ్డికి అప్పటి ఎమ్మెల్యేగా ఉండిన రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి మధ్య విభేదాలు తారా స్థాయికి చేరాయి. వైసీపీ ప్రభుత్వంలోనే ఆయన్ను ఒకసారి సస్పెండ్ చేయగా మరలా సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన సేవలు పార్టీకి అవసరమని గుర్తించి సస్పెన్షన్ ఎత్తి వేశారు. నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసి సుకుమార్‌రెడ్డి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున ఆయనను సస్పెండ్ చేయాలని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.